మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | ఆదివారం | 24.05.2026 | సంపుటి : 01 | సంచిక : 138 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | SUNDAY | 24.05.2026 | Volume : 01 | Issue :138 | Pages : 12 | Cost : 2/- |




# భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

**అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**

**ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**



**న్యూఢిల్లీ,మే 23 :** భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా–భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా– భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నా యని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. మిగతా2లో...

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన**

**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**

**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**



**న్యూఢిల్లీ,మే 23 :** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ మిగతా2లో...



# హరీష్ రావువి పగటి కలలు

**అధికారంలోకి రావడం కల్ల**

**ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన**

**అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్: మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,మే 23 :** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండి పడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. మిగతా2లో...

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**● ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు ● పాత ఇందిరమ్మ ఇల్ల పూర్తికి నిధులు కేటాయింపు ● జూన్ 1న కొఠారి గ్రామంలో ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం ● కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్,మే 23 :** రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మిగతా2లో...



# కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**- లారీని ఢీకొన్న క్రూజర్..ఐదుగురు దుర్మరణం**

**బెంగళూరు,మే 23 :** కర్ణాటకలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాడ్లాపూర్ సమీ పంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెంది న ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వెళ్తున్న క్రూజ ర్ వాహనం ముందున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగతా2లో...

# రైతులకు ఆధునిక టెక్నాలజీలను అందించాలి

**- డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి**

**- వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల**




**హైదరాబాద్,మే 23 :** భవిష్యత్ వ్యవసాయ రంగంలో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిగతా2లో...

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

**- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**


**- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ**



2లో

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

**బయటకు రావాలంటే భయపడతున్న జనాలు**



**న్యూఢిల్లీ,మే 23 :** దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ మిగతా2లో...

# వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

**- చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు**



**హైదరాబాద్,మే 23 :**చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' మిగతా2లో...

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**

**- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**

**- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,మే 23 :** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యో గాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపా రు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిం చారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నార న్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మిగతా2లో...

# బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

**- హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్**



**హైదరాబాద్,మే 23 :** బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నా రా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాం లోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందు కు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా2లో...

ఆదివారం ,
మే 24, 2026

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ



# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ఒఊ౬ఉజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొం టూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేళిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది.ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు కు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# యాదగిరిగుట్టలో సిఎం పర్యటన

**యాదగిరిగుట్ట,మే 23 :**
యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ంఏ, ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచనలు చేశారు.

# హరీష్ రావువి పగటి కలలు

(మొదటి పేజీ తరువాయి)

పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్య కారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు.

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1న ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చ్రర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్ట్స్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం.

# భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

(మొదటి పేజీ తరువాయి)

వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

# కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాడ్లాపూర్ దగ్గర లారీని క్రూజర్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. మృతులను క్యాస్వార్, హుస్సేన్, అలీ, రసూల్, ఫాతిమాగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రూజర్ వాహనం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా కుటుంబంలోని ఐదుగురు మృతిచెందడంతో బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రాణాంతకమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

(మొదటి పేజీ తరువాయి)

వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

# బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ్ఞ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

# వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

(మొదటి పేజీ తరువాయి)

స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

# రైతులకు ఆధునిక టెక్నాలజీలను అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈరోజు పర్యటించారు. తొలుత మంత్రి గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ ని సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగం పై చేస్తున్న పరిశోధన ల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల అభివృద్ధి చేసిన రోబోటిక్స్ మరియు సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించి ఇప్పటికే కొన్ని రోబోలని వ్యవసాయ రంగం లో ఉపయోగించే విధంగా అభివృద్ధి చేసినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలని మంత్రి అభినందించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి అందించిన ఉపగ్రహ ఆధారిత గణాంకాల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం లోని రైతాంగం యాజమాన్యం పరిధి లో ఉన్న మొత్తం భూమి లో సుమారు 9.3 శాతం భూమి సాగు లో లేదని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాలు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనం గా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకి చెందిన నాణ్యమైన మూల విత్తనాలని పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం చాలా అభినందనీయం అని మంత్రి అన్నారు.కొన్ని విత్తన కంపెనీల మాయ మాటలకి మోసపోకుండా రైతులు ఈ నాణ్యమైన విత్తనాలు వినియోగించి తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదే విధంగా రైతులు మార్కెటింగ్ అవకాశాలు ఉన్న పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలని అనుసరించాలన్నారు. 60 ఏళ్ల క్రితం ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సహా అనేక మంది మహానుభావుల తోడ్పాటు తో దేశం లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని మంత్రివర్యులు అభిప్రాయపడ్డారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి తోడ్పాటు తో విశ్వవిద్యాలయం ఇంకా పురోగతి సాధిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు నిరంతరం రైతుల తో మమేకం అయి వారికి కావలసిన పరిష్కారాలు అందించా లన్నారు. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అనేక అదునాతన టెక్నాలజీ లని విశ్వవిద్యాలయం రైతాంగానికి అందుబాటులోకి తీసుకొని రావాలని మంత్రి విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి సూచించారు. సాగుకు కీలకం అయిన నాణ్యమైన విత్తనాలని రైతాంగానికి అందించాలనే ఉద్దేశం తో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణి కార్యక్రమం చేపట్టామని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. కార్యక్రమం లో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠీ బలరామ్,డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై.చంద్రమోహన్ శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు అండగా బిఆర్ఎస్ ఉంటుందన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి

- రామాయంపేటలో యువత బిఆర్ఎస్ చేరికలు..
- అక్కన్నపేట యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పద్మాదేవేందర్ రెడ్డి



**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** మెదక్ జిల్లా రాజకీయాల్లో బిఆర్ఎస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామాయంపేట మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి గులాబీ కండువా కప్పి యువకులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో వగ్గు వంశీ (రఘుపతి), వెల్మల రేవంత్, ముత్యం రంజిత్, ముత్యం సందీప్, వగ్గు బన్ని, ముత్యం విష్ణు తదితరులు ఉన్నారు. అనంతరం పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీపై విశ్వాసం మరింత పెరుగుతోందన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చాయని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చగలిగేది బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు.రాబోయే రోజుల్లో యువత పార్టీకి బలంగా నిలవాలని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలపై పోరాడాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పాక్స్ చైర్మన్ బాధే చంద్రం, అక్కన్నపేట గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి,టౌన్ యూత్ అధ్యక్షుడు రొయ్యల నవీన్, మండల నాయకులు ఉమామహేశ్వర్, శ్రీకాంత్ సాగర్, మద్దూరి శ్రీనివాస్, తాటిపల్లి రాంకీ, దొమ్మట్ట శ్రవణ్ గౌడ్, వెల్మల మహేశ్, బోడ శ్రీకాంత్ (బబ్లూ), పప్పయ్యగారి నర్సింలు, ఎల్లగారి రాజు, నాగరాజు, వంశీ సాగర్, పవన్ సాగర్, రాఘవేంద్ర, ప్రశాంత్ సాగర్, స్వామి, సిద్ధారములు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు చల్లటి మజ్జిగ పంపిణీ చేసిన కణితి మధు.తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి





**ప్రజావాణి ప్రతినిధి ఎటపాక మండలం 23.** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు చల్లటి మజ్జిగ పంపిణీ చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మధు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ఉపాధి కూలీలుకు, మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు అలాగే ఉపాధి కూలీలు ఉపాధి పని చేసేటప్పుడు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు గంట గంటకు వాటర్ బేల్ విధానం ఏర్పాటు చేసి, ఉపాధి కూలీలకు మంచినీటి వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత పంచాయతీ ఉపాధి హామీ అధికారులకి కణితి మధు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పంచాయతీ ప్రధాన కార్యదర్శి బాదావత్ స్వామి, గ్రామ కమిటీ సభ్యులు తుమ్మల వెంకన్న, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి చేయూతనందించిన స్నేహితులు



**గరిడేపల్లి ప్రజావాణి మే 23** గరిడేపల్లి మండలం లోని పొనుగోడు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ కుటుంబానికి 10వ క్లాస్ బ్యాచ్ మిత్రులు సహాయ సహకారాలతో ?30,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా చామకూరి అంజయ్య మాట్లాడుతూ, "మీ కుటుంబానికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా మాకు చెప్పండి.. మేమంతా మీ కుటుంబానికి అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది.ఈ కార్యక్రమంలో చామకూరి అంజయ్య, నందిపాటి శ్రీను, పంగ నాగయ్య, మంగ సైదులు, కానుగు గురుస్వామి, బత్తిని విజయ్, బండి నాగయ్య, మద్దిమడుగు అరవింద్, రణపంగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# 99.55 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సిఎం...

- కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో సీఎం భూమిపూజ.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 23:**తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి క్షేత్రంలో రూ. 99.55 కోట్లతో ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో వైభవంగా భూమిపూజ. సాంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి వేద మంత్రోచ్చారణలు , మంగళ వాయిద్యాల నడుమ నిర్వ హించిన వేద పాఠశాలకు భూమిపూజ చేశారు. యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రంలో వేద పాఠశాల భూమిపూజ కార్యక్రమానికి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి భూమిపూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , కొండా సురేఖ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య , భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు , నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం , ఎమ్మెల్సీలు , సీఎంఓ కార్యదర్శి శ్రీనివాస రాజు , దేవదాయ సెక్రటరీ శైలజ రామయ్యర్ , దేవాదాయ కమిషనర్ హను మంతరావు , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతా ధికారులు , సంబధిత అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపనల వివరాలు...

వేద పాఠశాలకు కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి , వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణానికి , రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి , డార్మిటరీ హాల్స్ , దీక్షాపరుల సదనం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సంబందించిన అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ నడిబొడ్డున 'అన్నగారి' నిలువెత్తు విగ్రహం.మే 28న ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి అమీర్‌పేట మైత్రీవనం కూడలికి 'ఎన్టీఆర్ సర్కిల్' నామకరణం కొత్తపేటలో రూపుదిద్దుకున్న 13 అడుగుల కాంస్య విగ్రహం




**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం 23** హైదరాబాద్, తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, యుగపురుషుడు నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అపూర్వ నివాళి అర్పిస్తోంది. హైదరాబాద్ నడిబొడ్డున అన్నగారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28న (ఎన్టీఆర్ జయంతి) అమీర్‌పేటలోని మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం.23 అడుగుల ఎత్తులో సజీవ.రూపం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు శ్రమించి ఈ అద్భుత కాంస్య విగ్రహానికి ప

# గంజాయి, మత్తు పదార్థాల సేవనం లేదా విక్రయం చేస్తే కఠిన చర్యలు తప్పవు

- బస్టాండ్, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు
- సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు





**మన సమగ్ర ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 23**సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఈరోజు సుల్తానాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో బస్టాండ్, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలు మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో నార్కోటిక్ బృందం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను సేవించడం, విక్రయించడం లేదా రవాణా చేయడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎవరూ మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించినా, సేవించినా ప్రత్యేక పరీక్షలు మరియు తనిఖీల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.రైస్ మిల్లులు, ఇటుక బట్టీల యజమానులు తమ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎవరైనా గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధంగా గంజాయి సాగు చేసిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలంతా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.ఈ తనిఖీల్లో ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై అశోక్ రెడ్డి, నార్కోటిక్ బృందం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేడెక్కిన చేగుంట రాజకీయం


- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి జోలికొస్తే ఖబర్దార్- చేగుంట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి....



**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం :**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు చేగుంట మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో ఎక్కడికి అక్కడ కొనుగోలు కేంద్రాలలో ఓట్లు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వెళ్లి పరిశీలించడం జరిగింది. దీని ఆసరా తీసుకున్న కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారం మాట్లాడడం జరిగింది దీనికి బదులుగా మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులకు చురుకులు వెయ్యటం జరిగింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి లాభం లేదు నెలల తరబడి ఎదురుచూస్తున్న లారీలు రాకపోవడం గమనార్థం,పైగా ఎమ్మెల్యే పై అనుచిత వాక్యాలు చేసిన మండల కాంగ్రెస్ నాయకులపై మండల అధ్యక్షుడు ఫైర్ కావడం జరిగింది, వడ్ల కొను గోలు కేంద్రానికి లారీలు మళ్ళించడానికి సమయం లేదు కానీ చివాకులు మాట్లాడటం తెలుసు కాంగ్రెస్ నాయకులతో ఉంటూ టిఆర్ఎస్ నాయకులు మండిపడడం జరిగింది.ఈ కార్యక్రమంలో చేగుంట మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి,మంచికట్ల శ్రీనివాస్,ఎర్ర యాదగిరి, రాజగోపాల్,సోమ సత్యనారాయణ,కుర లక్ష్మీనారాయణ,రాజేష్ శ్రీకాంత్,మహమ్మద్ అలీ,మురాడి స్వామి,దుర్గి నరసింహులు,యాదగిరి,శ్రీకాంత్,పట్నం తానీషా,డిష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓలాక్ట్రా కంపెనీ వ్యర్థాలకు విలవిలలాడుతున్న చెరువు... చేపలు,పశువుల మృత్యుఘోష

- కలుషితమవుతున్న మంచినీరు
- పట్టించుకునే నాథుడు లేడని గ్రామస్తుల ఆవేదన









**షాబాద్// మే 23( ప్రజావాణి )**షాబాద్ మండలంలో ఓలాక్ట్రా కంపెనీ నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థాలతో స్థానిక చందన్ వెళ్ళి చెరువు తీవ్రంగా కలుషితమవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి నేరుగా వ్యర్థ జలాలు చేరడంతో చేపలు పెద్దఎత్తున మృతి చెందుతున్నాయని, నీరు తాగిన పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.చెరువు నీరు పూర్తిగా రంగు మారి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు తెలిపారు. ఇదే నీరు భూగర్భ జలాల్లో కలవడంతో గ్రామంలోని బోర్లు, మంచినీటి వనరులు కూడా కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. కాలుష్యాన్ని వెంటనే అరికట్టి, చెరువును శుద్ధి చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అందోల్ జోగిపేట్ బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం

- సామాన్య ప్రజల మీద పత్రికా విలేకరుల మీద మందుబాబుల వీరంగం





**మన సమగ్ర ప్రజావాణి ఆందోల్ జోగిపేట్ మే 23 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** గ్రామాలు, పట్టణాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక ప్రాంతాల్లో బెల్టు షాపులు బహిరంగంగానే నడుస్తున్నప్పటికీ, ఆప్కారి అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.బెల్టు షాపుల కారణంగా యువత మద్యం వ్యసనానికి గురవుతుండటంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలకు కూడా భంగం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కాలనీలు, గ్రామ శివార్లలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో ఎక్సైజ్ శాఖ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే అక్రమ బెల్టు షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పాలీసెట్ 2026 ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంక్‌ను సాధించిన కొడారు కౌశిక్ సాయి

● కొడారు కౌశిక్ సాయిని అభినందించిన మండల ప్రముఖులు



**చిలుకూరు మే23(ప్రజావాణి):** చిలుకూరు మండల కేంద్రానికి చెందిన సాక్షి విలేకరి కొడారు బ్రహ్మం కుమారుడు కొడారు కౌశిక్ సాయి ఈ రోజు విడుదలైన పాలీసెట్--2026 ఫలితాలలో 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. అలాగే ఇటీవల విడుదలైన TGRJC ఫలితాలలో కూడా 116 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించాడు. 10వ తరగతి ఫలితాలలో 600 మార్కులకు గాను 564 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా కౌశిక్ సాయికి మండల విద్యాధికారి గుజ్జుల నర్సిరెడ్డి, సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య,ఉపాధ్యాయులు,మండలానికి చెందిన పత్రిక విలేకరులు, రాజకీయ ప్రముఖులు అభినందనలు తెలియజేసినారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత విజయాలు సాధించి మండలానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు .

## పేకాట స్థావరాలపై ఆకస్మిక దాడి..



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,మే23:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపిఎస్ ఆదేశాల మేరకు,జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.కె.అన్వర్ పాషా ఆధ్వర్యంలో పరిగి పట్టణంలో పేకాట స్థావరాలపైన ఆకస్మిక దాడి నిర్వహించారు.పరిగి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఒక భవనంపై కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం ఈ దాడి చేపట్టింది.ఈ దాడిలో పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.31,450/- ల నగదు,పేక ముక్కలు,మరియు 5 మొబైల్ ఫోన్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వెంటనే పరిగి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ ఎస్.కె.అన్వర్ పాషా తెలిపారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

● అలిమ్కో సంస్థ చేయూత అభినందనీయం లిసర్పంచ్ కొల్లు పుల్లమ్మ



**చిలుకూరు మే23 ప్రజావాణి)** :ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో చిలుకూరు మండల సమగ్ర శిక్ష ఉపాధ్యాయ బృందం వారి సహకారంతో గత ఆరు నెలల క్రితం నిర్వహించిన క్యాంపులో చిలుకూరు మండలం నుండి 15 మంది శారీరక వికలాంగత్వం కలిగినటువంటి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉపకారణాల కొరకు గుర్తించడం జరిగింది. ఇందులో భాగంగా అలిమ్కో సంస్థ పంపించినటువంటి 6 గురికి వీల్ చైర్లు, 3 రోలెటర్, 3 హియరింగ్ ఎయిడ్ లు,3 మస్జిద్ కిట్ లను శనివారం మండల విద్యాధికారి గుజ్జుల నర్సిరెడ్డి, సర్పంచ్ కొల్లు పుల్లమ్మ చేతులు మీదుగా పిల్లలకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొల్లు నాగయ్య,చిలుకూరు ఎమ్ పి పి ఎస్ ఉపాధ్యాయులు శ్రీను, రామారావు, ఐ ఇ ఆర్ పి సుమలత,పద్మ ఎమ్ఆర్సి సిబ్బంది పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పట్టా అవార్డ్ గ్రహీత సరితకు ఘనసన్మానం



**దండేపల్లి మే 22,** మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన గరిసందుల లింగయ్య శంకరమ్మల కూతురు గరిసందుల సరిత వనపర్తి జిల్లా లోని సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా ఉద్యోగం చేస్తున్నారు. సరిత మండలం లోని లింగపూర్ వాస్తవ్యుడు గూడ అంజయ్య జీవితం, సాహిత్యం, పై పరిశోధన చేసి. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. సరిత పుట్టిన స్వగ్రామంమామిడిపెల్లి లో శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎల్తపు వైష్ణవి శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో . సరిత, తోపాటు, భర్త సురేందర్.కు. కుటుంబీకులై న శంకరమ్మ . లక్ష్మణ్ లకు శాలువ పూలమాలలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాటాడుతూ,సరిత నిరుపేద కుటుంబలో జన్మించి ఉన్నత విద్య నభ్యసించి. డాక్టరేట్ పట్టా పొందడం గ్రామానికి గర్వ కారణమన్నారు. అలాగే సరిత భర్త సైతం డాక్టరేట్ పొందడం విశేష కృషిని , వారి పట్టుదలను కొనియాడారు, ఈ కార్యక్రమంలో, విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు అలిశెట్టి లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ నూర తిరుపతి, వార్డు సభ్యులు, గొట్ల మహేందర్ , జిల్లపెల్లి భానుచందర్,

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం





**అశ్వారావుపేట,ప్రజావాణి న్యూస్ మే 23:** అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిని పరిశీలించారు.గత సంవత్సరం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మండలంలోని పాత రెడ్డిగూడెం గ్రామపంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి 100 శాతం ఇండ్ల మంజూరు జరిగిందని తెలిపారు. అయితే కొన్ని కుటుంబాలు అనివార్య కారణాల వల్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడం అసంపూర్తి నిర్మాణాలు మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించారు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ చక్కని అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీక అని ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు అధికారులు కూడా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకరించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మాజీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు,స్థానిక సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హైతాబాద్, నాగర్ గూడ లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు

● అధికారుల మౌనంపై అనుమానాలు.







**షాబాద్, //23 మే (ప్రజావాణి)** హైతాబాద్, నాగర్ గూడ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు విస్తృతంగా జరుగుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.పంచాయతీ రాజ్ టౌన్ ప్లానింగ్ అధికారులు సాధారణంగా “నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం, అవసరమైతే నిర్మాణాలను కూల్చివేస్తాం” అని చెబుతుంటారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు నిర్మాణదారులు అనుమతులు తీసుకున్నదానికంటే ఎక్కువగా సెల్లార్‌లు, అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ, అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి ఆగిపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఇటీవల ఒక నిర్మాణదారుడు గ్రామపంచాయతీ నుంచి జి+2 అంతస్తుల అనుమతి పొందినప్పటికీ, అదే స్థలంలో సెల్లార్‌తో పాటు ఐదు నుంచి ఆరు అంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు అధికారుల పరిశీలనలో బయటపడింది. పై అంతస్తుల నిర్మాణానికి అవసరమైన హెచ్ఎండీఏ అనుమతులు లేకపోయినా పనులు కొనసాగుతున్నాయని తెలుస్తోంది.అక్రమ నిర్మాణాలు ఒక్కరోజులో జరగవు. రోజుల తరబడి పనులు కొనసాగుతున్నప్పటికీ, ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు అంటున్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా ఆ నిర్మాణాలపై తదుపరి చర్యలు లేకపోవడం విమర్శలకు కారణమవుతోంది. కొందరు అధికారులు ముడుపులకు లోనై అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.హైతాబాద్, నాగర్ గూడ తో పాటు షాబాద్ మండలంలోని ఇతర ప్రాంతాల్లో కూడా అనుమతులు లేకుండా, సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదకరంగా భవనాలు నిర్మిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. సాధారణ ప్రజలు చిన్న తప్పిదం చేసినా చర్యలు తీసుకునే అధికారులు, రాజకీయ నాయకులు లేదా ప్రభావశీలుల నిర్మాణాలపై మాత్రం నిశ్శబ్దంగా ఉంటున్నారని విమర్శిస్తున్నారు.ఈ పరిస్థితులపై జిల్లా కలెక్టర్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మల్కాపూర్ రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిన జోగన్నగారి నర్సింలు

● ప్రజాహితం కోసం జీవితాన్నే అంకితం చేసిన మాజీ వైస్ ఎంపీపీకి ఘన నివాళులు .

**కొండాపూర్, మే 23 (ప్రజావాణి):** మల్కాపూర్ గ్రామ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన దివంగత మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా గ్రామ ప్రజలు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఆయన సేవలను స్మరించుకుంటున్నారు. 2006 మే 24న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో గుండెపోటుతో ఆయన పరమపదించగా, రెండు దశాబ్దాలు గడిచినా నేటికీ ప్రజల హృదయాల్లో ప్రజానాయకుడిగా నిలిచారు.

సాధారణ కుటుంబం నుంచి ప్రజానాయకుడిగా ఎదిగిన నర్సింలు.

1952లో వ్యవసాయ కూలీలైన లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతులకు జన్మించిన నర్సింలు చిన్ననాటి నుంచే ప్రజల సమస్యలపై అవగాహన కలిగి ఉండేవారు. సంగారెడ్డిలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన ఆయన, శ్రీమతి వెంకటమ్మను వివాహం చేసుకుని కుటుంబ బాధ్యతలతో పాటు ప్రజాసేవలో అడుగుపెట్టారు. మొదట మల్కాపూర్ పోలీస్ పటేల్‌గా, అనంతరం పట్వారీగా పనిచేసి గ్రామ ప్రజలతో మమేకమయ్యారు.

ఓటమి ఎరుగని రాజకీయ ప్రస్థానం.

1988లో మల్కాపూర్ సర్పంచ్‌గా ఘన విజయం సాధించి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నర్సింలు, గ్రామాభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందారు. 1995లో తన సతీమణి వెంకటమ్మను మల్కాపూర్ తొలి మహిళా సర్పంచ్‌గా గెలిపించి మహిళా సాధికారతకు బాటలు వేశారు. అనంతరం 2001లో మల్కాపూర్-గిర్మాపూర్ ప్రాంతాల నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎం.పీ.టీ.సీగా విజయం సాధించి కొండాపూర్ మండల వైస్ ఎంపీపీ పదవిని అధిష్టించారు.

గ్రామాభివృద్ధికి పునాది వేసిన నాయకుడు.

నర్సింలు హయాంలో మల్కాపూర్ గ్రామ రూపురేఖలు మారిపోయాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి మంచినీటి ట్యాంకులు నిర్మించడం, బోర్లు వేయించడం, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో





రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించడంతో పాటు విద్యుత్ సౌకర్యాల విస్తరణకు ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తుల సహకారంతో ఒక ఎకరం స్థలం సమీకరించడం ఆయన దూరదృష్టికి నిదర్శనంగా నిలిచింది.అంతేకాకుండా ఎన్నో ఆటంకాలను అధిగమించి వీరభద్రునిపల్లెకు రహదారి నిర్మాణం పూర్తి చేయించడం ద్వారా గ్రామ ప్రజల మన్ననలు పొందారు.

న్యాయానికి కట్టుబడి నిలిచిన నాయకత్వం.

గ్రామంలో ఎలాంటి వివాదాలు వచ్చినా పోలీస్ స్టేషన్ వరకు వెళ్లకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు కృషి చేసేవారు. పంచాయితీల్లో ముక్కుసూటిగా మాట్లాడే ఆయన, ఎప్పుడూ న్యాయం వైపే నిలబడేవారని గ్రామ పెద్దలు గుర్తుచేసుకుంటు న్నారు. పేద ప్రజలకు అండగా నిలిచి ఎన్నో కుటుంబాలకు న్యాయం చేశారని ప్రజలు ఇప్పటికీ స్మరించుకుంటున్నారు.

తండ్రి ఆశయాలతో ప్రజాసేవలో కుమారుడు ప్రవీణ్.





జోగన్నగారి నర్సింలు ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ఆయన కుమారుడు ప్రవీణ్ ప్రస్తుతం మల్కాపూర్ ఉపసర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ కాగ్నిజెంట్ లో మేనేజర్‌గా ఉన్న ఉద్యోగాన్ని వదిలి గ్రామ ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన ప్రవీణ్, గత నాలుగేళ్లుగా ప్రజల్లోనే ఉంటూ సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానం రిజర్వేషన్ కారణంగా అవకాశం లేకపోయినా వార్డు సభ్యుడిగా గెలిచి అనంతరం ఉపసర్పంచ్‌గా ఎన్నికై తండ్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో ముందుకు సాగుతున్నారు.

జోగన్నగారి నర్సింలు 20వ వర్ధంతి సందర్భంగా గ్రామ ప్రజలు, అభిమానులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించనున్నారు.

# కాటారంలోనే పాలీసెట్ కౌన్సిలింగ్ సేవలు

**మంథని నియోజక వర్గం, మే 23, ప్రజావాణి:** తెలంగాణ రాష్ట్రంలోని డిప్లమా ఇన్- ఇంజనీరింగ్, పాలిటె క్నిక్ పాలీసెట్ 2026 ఫలితాలు శనివారం ఉదయం 11:30 గంటలకు మాసాబ్ ట్యాంకులోని సాంకేతిక విద్యమండలి కార్యాలయంలో ఈ ఫలితాలను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీ దేవసేన విడుదల చేశారు.విద్యార్థుల మార్కుల ఆధారంగా తెలంగాణ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ నాన్ -ఇంజనీరింగ్ టెక్నా లజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించబడ తాయి,ఈ నేపథ్యం లోనే విద్యార్థుల సౌకర్యార్థం భూపాల పల్లి జిల్లా కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాలీసెట్ పరీక్ష రాసి పాలిటెక్నిక్ సీటు పొందే విద్యార్థు లు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కాటారంలోనే ధృవపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ, వెబ్ ఆప్షన్ల నమోదు వంటి సేవలను పొందవచ్చున్నారు.ఇప్పటి వరకు విద్యా ర్థులు వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్,వంటి దూర ప్రాంతాలకు వెళ్లి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి వచ్చే దని, దీనివల్ల సమయం, వ్యయభారం పెరుగు తుండేదన్నారువిద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సహాయక కేంద్రాన్ని కాటారం లో ఏర్పాటు చేసిందని తెలిపారు.పాలీసెట్ తొలి విడత కౌన్సిలింగ్‌లో భాగంగా ధృవపత్రాల పరిశీలన ఈ నెల 29-05-2026 నుండి 01-06-2026 వరకు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యా ర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమయానికి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.



# ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా..!

- జూన్ 5 బహిరంగ సభను విజయవంతం చేయండి
- బిసి, ఎస్సి, ఎస్టీ -జెఏసి జిల్లా నాయకులు
- బోయిని సదన్ మహారాజ్ పిలుపు



**బెజ్జంకి, మే 23 (ప్రజావాణి):** సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా “ఎవరి కులం ఎంతో.. వారికంత వాటా..!” అనే నినాదంతో బీసీ ,ఎస్సి , ఎస్టీ -జెఏ సి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 5న నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి కులానికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా దక్కాలని డిమాండ్ చేస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బిసి,ఎస్సి, ఎస్టీ-జెఏసి రాష్ట్ర చైర్మన్ విశారదన్ మహారాజ్ హాజరవుతారని పేర్కొన్నారు. జూన్ 5న సాయంత్రం 4 గంటలకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హై స్కూల్ మైదానం (సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రాంగణం)లో జరిగే ఈ బహిరంగ సభకు బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు బోయిని సదన్ మహారాజ్, మహంకాళి సురేష్, కట్ల అంజిబాబు, బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్, ఉపసర్పంచ్ దూమాల మహేష్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఐలేని శ్రీనివాస్ రెడ్డి, స్వేరో నాయకులు బొర్ర సురేష్ కుమార్, సీపీఎం నాయకులు బోనగిరి లింగయ్య, చిట్యాల శంకర్, మక్సుద్, కల్లూరి రవీందర్, రాజు, చిరంజీవి, అంజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి ప్రదర్శనకు సీఎంను ఆహ్వానించిన జిల్లా కలెక్టర్...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 23:** హైదరాబాద్ హైటెక్స్ లో నిర్వహించనున్న పోచంపల్లి ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. కళను , హస్తకళను , సాంస్కృతిని ప్రతిబింబించే పోచంపల్లి దారంతో సాంప్రదాయ చేతితో నేయబడిన ప్రదర్శన జూన్ 5 , 6 , 7 తేదీ లలో హైటెక్స్ , హైద్రాబాద్ లో కలదని ఆహ్వాన పత్రికను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసి ఆహ్వానించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి. అందుకు సాను కూలంగా స్పందించిన ముఖ్య మంత్రి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు.

# సీఎంను కలిసిన తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి...

- బస్వాపూర్ భూ నిర్వాసులకు న్యాయం చేయాలని వినతి.
- కాలనీ అభివృద్ధికి 134 కోట్లు మంజూరు చేయండి.
- కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 23** తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానముగా ప్రసిద్ధి గాంచుతున్న యాదగిరిగుట్ట పర్యటనకు పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కొరకు విచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనీల్ కుమార్ రెడ్డిని బి.ఎన్ తిమ్మాపురం గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ముఖ్య మంత్రికి బస్వాపూరం రిజర్వాయర్ లో మా బి.ఎన్ తిమ్మాపురం గ్రామ పంట భూములతో పాటు మా స్థిర నివాసాలైన ఇండ్లను సైతం కోల్పోయి సర్వస్వం కోల్పోతున్నామని తెలుపుతూ మాకు రావలసిన ఇండ్ల నష్ట పరిహారం , ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి నిధులు 134 కోట్లు మంజూరు చేస్తే మాకు కేటాయించిన ఆర్‌డఆర్ కాలనిలో పూర్తి స్థాయిలో ఇండ్లను నిర్మించు కుంటామని , ఆర్‌డఆర్ కాలనీ అభివృద్ధి పనులు కూడా పూర్తవు తాయని వినతి పత్రాన్ని అందజేశారు. నూతన ఆర్‌డఆర్ కాలనిలో కూడా మౌలిక వసతులు రోడ్లు , మంచినీరు , డ్రైనేజీ , స్కూల్ బిల్డింగ్ నిర్మాణాలు అన్ని ఏర్పాట్లు చేసి కాలనీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలో మీ నష్ట పరిహారం విడుదల చేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి నష్టపరిహారాన్ని త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , నిరంతరం బిఎన్ తిమ్మాపురం నష్టపరిహారనికై అహర్నిశలు కృషి చేస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డికి మా బి.ఎన్ తిమ్మాపురం గ్రామ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తున్నామని సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి తెలిపారు.

# 24 తేదీ నుంచి పని బంద్

- షాబాద్ మండల సెంట్రింగ్ యూనియన్ కాంట్రాక్టర్ అసోసియేషన్
- తమ డిమాండ్ లు నెరవేరే వరకు సమ్మె



**షాబాద్, మే 23 ( ప్రజావాణి):** షాబాద్ మండల కేంద్రంలో సెంట్రింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ...కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో పాల్గొన్న కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సి మెంబర రవి, పి రమేశ్, ప్రకాష్,రాజు, నర్సింలు, శ్రీశైలం,కే, రమేష్,రవి, చెన్నయ్య, చంద్ర శేఖర్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి ఎఐటియుసి డిమాండ్




**పోరుమామిళ్ల (మే 23)ప్రజావాణి** ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆర్టీసీ ఆస్తుల కోసమా, లేక కార్పొరేట్ ల ఆస్తులు కూడా పెట్టడం కోసమా ఏఐటియుసి ప్రభుత్వానికి ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఆర్టీసీ బస్టాండ్ లను అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటు ఏఐటీయూసీ ఆర్టీసీ ప్రైవేట్ పరం చేయాలని ఆలోచన విరమించుకోవాలని ఏఐటియుసి ఏరియా నాయకులు రవికుమార్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు బోస్ పాలకు ప్రభుత్వాలు చేస్తున్న తీరుపై విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలో ఏఐటీయూసీ మండల సమితి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ వ్యవస్థలో విలువైన, ప్రధానమైన పట్టణాలలో ఉన్న ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడం వేలాదిమంది ఆర్టీసీ ఉద్యోగులను నడిరోడ్డు పైన అమ్మకానికి పెట్టినట్టే అని వారన్నారు అలాగే ఆస్తుల రక్షణ -కార్పొరేట్ ప్రయోజనాలుప్రజాధనంతో, దశాబ్దాల శ్రమతో కూడబెట్టిన ఆర్టీసీ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడమేనా ప్రభుత్వ లక్ష్యం?రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల నడిబొడ్డున ఉన్న వేల కోట్ల విలువైన ఆర్టీసీ స్థలాలపై పాలకులకు ఉన్న కన్ను నిజం కాదా?నష్టాల సాకుతో విలువైన ప్రభుత్వ భూములను బడా బాబులకు అప్పగించడం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం ఏమిటి? కృత్రిమ నష్టాలు - కమిషన్ల బాగోతంసంస్థను లాభాల్లోకి తెచ్చే వ్యూహాలు పక్కన పెట్టి, కావాలనే నష్టాలు చూపిస్తూ ప్రైవేటీకరణకు స్క్రీన్ ప్లే సిద్ధం చేస్తున్నారా?ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడం ద్వారా కొందరు పెద్దలకు అందే ముడుపులు, కమిషన్ల విలువ ఎంత?డీజిల్ ధరల భారం, పన్నుల భారాన్ని తగ్గించి సంస్థను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటోంది. కార్మికులు -ప్రజా ప్రయోజనాలుప్రైవేటీకరణ జరిగితే దళిత, బలహీన వర్గాలకు దక్కే ఉద్యోగ రిజర్వేషన్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయన్న నిజాన్ని ఎందుకు దాస్తున్నారు?వేలాది మంది కార్మికుల జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టడానికి మనస్సాక్షి ఎలా ఒప్పుకుంటోంది? ప్రైవేట్ బస్సులు వస్తే ఛార్జీలు పెరిగి, సామాన్య ప్రయాణికుడిపై పడే అదనపు భారాన్ని ప్రభుత్వం భరిస్తుందా? కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రభుత్వ రవాణా రంగాన్ని బలి పశువును చేయడం సిగ్గుచేటని వారన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆపి వేలాది మంది ఆర్టిసి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీని కాపాడాలని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు సఫా,డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కోదూరు కేశవ, ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ పిడుగు పిరయ్య తదితరులు పాల్గొన్నారు

# లక్ష్మీపురం పంచాయతీ బూరుగువాయి తండాలో అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు దగ్గం




**ప్రజావాణి ప్రతినిధి ఎటపాక మండలం మే 23 :** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ, బురుగువాయి గ్రామంలో, గుండి,కుమారి, ఇల్లు ప్రమాదవశాత్తు పూర్తిగా కాలిపోవడం జరిగింది చాలా మటుకు ఆస్తి నష్టం రెండు లక్షల 94000 ఆస్తి నష్టం జరిగినట్టు గ్రామస్తులు తెలియజేయడం జరిగింది ఘటన జరిగిన స్థలానికి ఎటపాక మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కణితి మధుబాబు చేరుకొని కుటుంబం సభ్యులు పరామర్శించి మీకు ప్రభుత్వం నుండి తగు న్యాయం చేసే విధంగా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది

# ఘనంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు...

- కేక్ కట్ చేసి పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్.
- ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.
- పాల్గొన్న జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీల పద్మ.





**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23** ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఆయిలయ్య , జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నీల పద్మల ఆధ్వర్యంలో శనివారం రోజు తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కేంద్రంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం మున్సిపల్ మహిళ కార్మికులకు , చీరలను పంపిణీ చేయడం జరిగింది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎల్లప్పుడూ పెదలకు అండగా నిలుస్తూ , ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , అభిమానులు , మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కూనవరం నుండి రంప చోడవరం రేలా ఆదివాసి ఉత్సవ బహిరంగ సభకు వాలంటీర్ గా వెళుతున్న యువకులు




**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం మే 23.** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం టేకుల బోరు పున్నెం ముత్తయ్య స్తూపం నుండి వాలంటీర్లుగా వెళుతున్న యువకులు కూనవరం బస్టాండ్ వరకు ర్యాలీగా బయలుదేరి రేపు 24 జరిగే ఆదివాసి గిరిజన సంఘం రేలా ఉత్సవ భారీ బహిరంగ ప్రదర్శన సభకు 12 మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చే ఆదివాసి ప్రజలకు ఎటువంటి లోటు రానీయకుండా ఉండడం కోసం కూనవరం మండలం నుంచి 34 మంది ఆదివాసి యువకులు బయల్దేరి రంపచోడవరం కేంద్రానికి ఆదివాసి గిరిజన సంఘం తరఫున పంపించడం జరుగుతుంది. కావున రేపు జరిగే బహిరంగ ప్రదర్శన సభకు భారీ ఎత్తున తరలివచ్చి ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలను విజయవంతం చేయాలని కూనవరం ఆదివాసి గిరిజన సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాబు బొర్రయ్య పాయం, సీతారామయ్య రైతు సంఘం నాయకులు మేకల నాగేశ్వరరావు తెల్లం తమ్మయ్య మాడెం బాబురావు వియికా నారాయణ మడకం నాగమణి ,ఎంపిటిసి ధర్మల అమ్మాజీ ఎఫ్ఐ తాలూరి శ్రీనివాస్ వూయిక కన్నయ్య ఎస్ఎఫ్ఐ సోడి వినోద్ పిఎన్ఎమ్ జెట్టి మారయ్య తదితరులు పాల్గొన్నారు

# ఫోన్ ట్యాపింగ్ కుట్రపై సిట్ ముందు జీఎంఆర్ వాంగ్మూలం”

- “ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే దోషులకు కఠిన శిక్ష తప్పదన్న దేవరకద్ర ఎమ్మెల్యే”
- “గత ప్రభుత్వ అక్రమాలపై తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం”




**మన ప్రజావాణి దేవరకద్ర :** హైదరాబాద్‌లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసుకు సంబంధించి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శనివారం హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు హాజరై కీలక వాంగ్మూలం అందజేశారు. సిట్ అధికారులు గత ప్రభుత్వం సమయంలో తన ఫోన్‌ను అక్రమంగా ట్యాపింగ్ చేసినట్లు సమాచారం ఉందని, దీనిపై వివరాలు ఇవ్వాలని కోరడంతో జీఎంఆర్ సిట్ ఎదుట హాజరై పలు అంశాలను వెల్లడించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ... “ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తిగత స్వేచ్ఛ, రాజకీయ హక్కులను ఉల్లంఘించే విధంగా ఫోన్ ట్యాపింగ్ జరగడం అత్యంత దురదృష్టకరం. గత ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి అక్రమ పద్ధతులను ఆశ్రయించింది. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు నిజాలు తెలియజేయాలి” అని డిమాండ్ చేశారు. అలాగే, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పోరాడిన నాటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో రాజకీయ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపించారు. తాను డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తన ఫోన్ సహా పలువురి ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తుండగా... ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయంగా ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపే అంశంగా మారింది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో యువతకు శుభవార్త

- 150 మంది యువకులకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసిన అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి ప్రతినిధి మే 23 ప్రజావాణి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు 150 మంది యువతకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేశారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యువత స్వయం ప్రతిభను చాటుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం యువత ఉపాధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. వివిధ ప్రైవేట్ సంస్థలతో సమన్వయం చేసుకొని ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఉద్యోగాలు పొందిన యువతలో ఆనందం వ్యక్తమైంది. తమకు ఉపాధి అవకాశాలు కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగ నియామక సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదివారం, మే 24, 2026 | ప్రజావాణి తెలుగు డైలీ



# ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించిన సర్పంచ్



**మంథని నియోజక వర్గం, మే 23, ప్రజావాణి:** మల్లేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ, వార్డు సభ్యుడు గువ్వల ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి కనీస వేతనం, మౌలిక సదుపాయాలు, పనివేళల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం వేళల్లోనే పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

# కాక్రోచ్ ఉద్యమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వాలని జాగారెడ్డి కోరారు




**సంగారెడ్డి ప్రతినిధి మే 23 ప్రజావాణి:** జగ్గారెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న కాక్రోచ్ ఉద్యమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను కాంగ్రెస్ పార్టీలో చిన్న ఉద్యోగం చేస్తున్న వ్యక్తినని, పార్టీకి సంబంధించిన అంశాలపై మాట్లాడే అధికారం మరియు స్పష్టత రాహుల్ గాంధీకే ఉందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో, కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమాలకు అండగా నిలవాలని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకత్వం స్పష్టమైన వైఖరి ప్రకటిస్తే కార్యకర్తలకు మరింత ఉత్సాహం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు

# రాష్ట్ర ఫిలిమ్ తెలివిజన్డేవప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా సుమన్ నియామపకమ్



- హర్షం వ్యక్తం చేసిన తాళ్ల కళ్యాణ్

**మన సమగ్ర ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 23:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ ఓ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా ప్రముఖ తెలుగు సినీ నటుడు సుమన్ నియమితులైన సందర్భంగా, హైదరాబాద్లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి (అసిస్టెంట్ డైరెక్టర్స్ విభాగం), పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తాళ్ల కళ్యాణ్. ఈ సందర్భంగా తాళ్ల కళ్యాణ్ మాట్లాడుతూ, సినీ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సుమన్ ఏ పాత్రనైనా తనదైన శైలిలో అద్భుతంగా పోషించి తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుమన్ కి ఫిల్మ్, టెలివిజన్ థియేటర్ రంగాల అభివృద్ధి కోసం ఈ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, సినీ కార్మికుల శ్రేయస్సు కోసం చిత్తశుద్ధితో పని చేస్తానని తెలిపారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై సమీక్ష సమావేశం



**సంగారెడ్డి ప్రతినిధి మే 23 ప్రజావాణి:** సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశీలకులు మంజునాథ ముఖ్య అతిథిగా హాజరై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగంలో చేపడుతున్న డిజిటల్ సేవలను గ్రామీణ స్థాయి వరకు సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోగికి సంబంధించిన వైద్య వివరాలు, చికిత్స చరిత్ర, పరీక్షల నివేదికలు, ఆరోగ్య పరిస్థితి వంటి సమాచారం డిజిటల్ రూపంలో నమోదు కావడం వల్ల వైద్య సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందించవచ్చని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రులలో సాంకేతిక సదుపాయాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావుతో పాటు పలువురు వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య సేవలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించి, డిజిటల్ విధానాల అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రాఘురాం రెడ్డి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..





**మన ప్రజావాణి ఖమ్మం టౌన్ ప్రతినిధి మే 23:** ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్ ఎంపి క్యాంపు కార్యాలయం లో ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురాం రెడ్డి సిపారస్సు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని, లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, వడ్డెబోయిన నరసింహారావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కోప్పుల చంద్రశేఖర్, మూడుమూంతల గంగారాజు, బాణాల లక్ష్మణ్, నరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు..

# పంట అవశేషాలను కాల్చవద్దు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై



చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చినపుడు హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు. రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఇస్నాపూర్మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం

**సంగారెడ్డి ప్రతినిధి మే 23 ప్రజావాణి:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు క్రీడలు, వినోదం కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకులు మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, ఇస్నాపూర్ ప్రాంతంలో రోజురోజుకు జనాభా పెరుగుతున్న నేపథ్యంలో యువత, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా మినీ స్టేడియం మరియు పార్కు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి వసతులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రస్తుతం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో క్రీడా మైదానాలు, పార్కులు సరిపడా లేకపోవడం తో యువత ఇబ్బందులు




పడుతున్నారని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడకలు, వ్యాయామం, ఆటల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మినీ స్టేడియం, ఆధునిక పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమిస్తున్నారని, దీంతో భవిష్యత్తులో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, ఇస్నాపూర్ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని నవనిర్మాణ సేన సభ్యులు కోరారు

# రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** రాబోయే సాగు సీజన్లను దృష్టిలో ఉంచుకుని రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ధరలకు విత్తనాలు అందిస్తామని, అధిక దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తూ రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని, రైతులు అలాంటి మోసపూరిత ప్రచారాలను నమ్మకుండా అధికారిక లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అనధికారిక వ్యక్తులు లేదా గుర్తింపు లేని వ్యాపారుల వద్ద నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కలెక్టర్ సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు తీసుకొని



భద్రపరచుకోవాలని, వ్యవసాయ శాఖ సూచించిన ధృవీకరించిన రకాల విత్తనాలనే వినియోగించాలని, తెలియని కొత్త రకాల విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే ముందు సంబంధిత వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులపై సమాచారం తెలిసినా లేదా ఎవరైనా అనుమానాస్పదంగా విక్రయించే ప్రయత్నం చేసినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1077 కు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కంట్రోల్ రూమ్ తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

రైతులు అప్రమత్తంగా వ్యవహరించి నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం కీలకం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టూరిజం కిట్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్ని టూరిజం కిట్ను విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సహజసిద్ధమైన పర్యాటక




ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పర్యాటక వారోత్సవాలు దోహద పడతాయని అన్నారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి. సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏఈ నరేష్ నాయక్, ఖమ్మం టూరిజం సిబ్బంది జె. చంద్రశేఖర్ ఆజాద్, యువత, తదితరులు పాల్గొన్నారు.

# షాద్నగర్ మార్కెట్ యార్డును సందర్శించిన సమస్యల పరిశీలన

- వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం -- నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది -- అందె బాబయ్య

**షాద్ నగర్ ప్రజా వాణి మే 23:** షాద్నగర్ మార్కెట్ యార్డును బీజేపీ నాయకులు సందర్శించి రైతుల సమస్యలను పరిశీలించారు బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ అందె బాబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి ఇస్నాత్ శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మార్కెట్ యార్డును సందర్శించిన నాయకులు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డు సెక్రటరీతో సమావేశమై కొనుగోలు ప్రక్రియలో ఉన్న లోపలపైన చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతును వివరించారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా డీఏపీ, యూరియా ఎరువుల ధరలను పెంచకుండా భారీ సబ్సిడీతో రైతులకు అందిస్తోందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం 16 రకాల పంటలకు ప్రతి ఏడాది మద్దతు ధర పెంచుతూ ప్రస్తుతం వరి ధాన్యానికి రూ.2389, మొక్కజొన్నకు రూ.2400 వరకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం “ప్రతి గింజను కొనుగోలు చేస్తాం” అంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ రైతులకు



న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం మీద నమ్మకం లేక రైతులు తక్కువ ధరలకే తమ పంటలను అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల రైతులు భారీ నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వరికి ప్రకటించిన రూ.500 బోనస్ను వెంటనే బిల్లులతో పాటు చెల్లించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మొక్కజొన్న కొనుగోళ్లలో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లోని ఐకేపీ సెంటర్లలో మౌలిక వసతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకుని రైతులకు అండగా నిలవాలని సూచించారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించాలని కూడా కోరారు. అందె బాబయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. షాద్నగర్ మార్కెట్ యార్డులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఏ రైతు ఏ పంట సాగు చేస్తున్నారనే విషయాన్ని ముందుగానే మార్కెట్ కమిటీ అధికారులు, వ్యవసాయ శాఖ ఏఈవోలు నమోదు చేయకపోవడంతో అనేక మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అమ్ముకోలేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల ప్రతి రైతు ఎకరాకు దాదాపు రూ.10 వేల వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు, గోదాంలు, తాగునీరు, టార్పాలిన్లు, సంచులు, విశ్రాంతి సౌకర్యాలు మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల సురేష్, మల్చలం మురళి, శ్రీనివాస్ చారి, ఎంకనోళ్ల వెంకటేష్, రఘు, శివశంకర్, నరేష్, నవీన్, కార్తీక్, సాయి, కళ్యాణ్ తదితరులు హాజరయ్యారు.

# నిత్య కష్టాల్లో గొర్రెలు, మేకలు మందలు కాపర్లు బతుకుకులు ...?

- మేతనిచ్చే స్థలాలు తగ్గిపోవడం తో గొర్రెలు, మేకలు కు మేత కోసం నిత్య ఇబ్బందులు పడుతున్న కాపర్లు
- ప్రకృతి పగ పట్టడం వల్ల పిడుగులు పడి వందలు గొర్రెలు, మేకలు మృత్య వాత పడుతున్నాయి..
- కష్టాల్లో గొర్రెలు మందలు కాపర్లు బతుకుకులు ?...








**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లా ఉద్దాన,పల్లపు ప్రాంతానికి చెందిన యాదవుల్లో కొందరూ ప్రధాన జీవనాధారంగా చేసుకొని గొర్రెలు, మేకలు మందలు కాపర్లు ఉన్న వారి బతుకులు అష్టకష్టాలు పడుతున్నారూ. గొర్రెలు కాపర్లు జీవనము ఎంతో శ్రమతో కూడుకున్నది అని చెప్పక తప్పదు . ఎండ, వానకు తడిచి పోతూ తీవ్ర మైన చలి తో దిన దిన అవసరాలతో అష్టకష్టాలు పడుతున్నారూ. రోజంతా అడవుల్లోను , జీడి తోటల్లో ఉంటూ పాములు , ఎలుగుబంట్లు, కూర జంతువులు బారిన పడకుండా గొర్రెల మందలు నడుపుతున్నామని బాధితులు పేర్కొన్నారు. ప్రధానంగా గొర్రెలు,మేకలకు మేత లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ వారు తెలిపారు. రోజంతా అడవుల్లో, కొండల్లో తిరగడం, విషసర్పాలు, క్రూర జంతువుల బారిన పడకుండా రక్షించడం, పచ్చిక లేక ఇబ్బంది పడటం వారి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.ఆధునిక కాలంలో మేత స్థలాలు తగ్గిపోవడం, కూలీల కొరత, ఆర్థిక సంక్షోభం వారిని తీవ్రంగా వేధిస్తున్నాయి.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి తెలుగు రాష్ట్రాల్లో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఇలున్నాయి. పచ్చికభూములు మరియు మేత సమస్య ఉంది అలాగే అడవులు తగ్గిపోవడం, భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడంతో గొర్రెలను మేపేందుకు స్థలాలు దొరకడం లేదు.వర్షాభావ పరిస్థితుల్లో గడ్డి దొరక్క, నీరు లేక గొర్రెలు అనారోగ్యానికి గురవుతుంటాయి,వాతావరణ మార్పులు:ఎండకాలంలో తీవ్రమైన ఎండలు, వానాకాలంలో వరదలు, చలికాలంలో తీవ్రమైన చలికి కాపరులతో పాటు గొర్రెలు కూడా మృత్యువాత పడే ప్రమాదాలు జరుగుతున్నాయి. దొంగల భయం, క్రూర జంతువులు:రాత్రి వేళల్లో తోడేళ్లు, నక్కలు, కుక్కల దాడిలో గొర్రెలు చనిపోతుంటాయి.గొర్రెల దొంగతనాలు పెరిగిపోవడం వల్ల రాత్రిళ్లు కూడా కాపరులు మేల్కొని కాపలా కాయాల్సిన పరిస్థితి ఉంది.సంచార జీవనం - కుటుంబానికి దూరంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.గొర్రెలకు రోగాలు వస్తే ఖరీదైన వైద్యం చేయించడం ఆర్థికంగా భారంగా మారుతుంది.మార్కెట్‌లో దళారీల మోసాల వల్ల గొర్రెలకు సరైన ధర లభించడం లేదు. మాంసం ధరలు పెరిగినా, ఆ లాభాలు మాత్రం కాపరులకు దక్కడం లేదు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందకపోవడం: ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెల పంపిణీ, బీమా లాంటి పథకాలు అర్హులైన వారికి అందుబాటులోకి లేక పోవడము వల్ల కాపర్లు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.. ప్రభుత్వాలు గొర్రెలు , మేకలు మందలు కాపర్లు బతుకుకులు మేలు కోసము సహాయము చేయగలరని వారు కోరుతున్నారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి





**మన ప్రజావాణి దేవరకద్ర** :తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి , డోకూర్ సర్పంచ్ శ్రీనివాస్, జీనుగారాల కాంగ్రెస్ నాయకులు సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్



**రాయికల్;మే 23(ప్రజావాణి)** :99 రోజుల "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండల స్థాయి క్రీడాంశాల్లో నిర్వహించిన చెస్ పోటీలో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వివేకనంద స్టేడియంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అభినందించి మెమెంటోలను అందజేశారు.బాలికల విభాగంలో రాయికల్ మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మూడపెల్లి చైత్ర ప్రథమ స్థానం,తీగల శాన్వి ద్వితీయ స్థానం సాధించారు.బాలుర విభాగంలో నక్క మనీష్ విజేతగా నిలిచాడు.విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన స్థానిక ఫిజికల్ డైరెక్టర్ కోల రాజగోపాల్ ను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.గెలుపొందిన విద్యార్థులను సర్పంచ్ గుర్రం భావన మహేందర్, ఉపసర్పంచ్ సంజీవ చారి, వార్డు సభ్యులు,హెచ్ఎం యు.వి. రమణి, సీనియర్ ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య,ఉపాధ్యాయులు శంకరయ్య,సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, కమారుద్దీన్, వేణుగోపాల్, రాజగోపాల్, సురేష్, పుష్పలత,భవాని,శైలజ, వంశీధర్ రావు తదితరులు అభినందించారు.

# ఘనంగా మల్లాపూర్ లో గ్రేట్ ఇండియా ఫ్యాషన్ ఎక్సపో ఫెస్టివల్ ప్రారంభోత్సవం

- పాల్గొన్న టి పి సి సి జనరల్ సెక్రెటరీ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా,సినీనటి రాగిణి





**మేడిపల్లి మే 23( మన ప్రజావాణి)** మల్లాపూర్ నోవా కళ్యాణ మండపంలో పి ఆర్ ఈవెంట్స్ అధినేత సిద్ధి రాజేందర్,సిద్ధి ప్రగతి ఆధ్వర్యంలో గ్రేట్ ఫ్యాషన్ ఎక్సపో ఫెస్టివల్ ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్త,సినీనటి రాగిణి పాల్గొని ఎగ్జిబిషన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు నచ్చే అధునాతన వస్త్రాలు,ఆభరణాలు,అన్ని రకాల గృహోపకరణాలు, రియల్ ఎస్టేట్,పిండి వంటలు,మిఠాయిలో మొదలైన అన్ని రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అందించాలని గ్రేట్ ఇండియా ఫ్యాషన్ ఫెస్టివల్ ఎగ్జిబిషన్ యాజమాన్యానికి సూచించారు.ఎగ్జిబిషన్ మే 23,24 (శని,ఆది)వారాలలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10:00 వరకు ఎగ్జిబిషన్ సేల్ కొనసాగుతుందని, మల్లాపూర్,నాచారం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.అనంతరం పి ఆర్ ఈవెంట్స్ అధినేత రాజేందర్ మాట్లాడుతూ మొదటిసారి మల్లాపూర్ నోవా ఫంక్షన్ హాల్ లో ఎగ్జిబిషన్ సేల్ ఏర్పాటు చేశామని,కుటుంబ సమేతంగా అన్ని ఒకే చోట సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులను అందించేందుకు కృషి చేస్తున్నామని,భవిష్యత్తులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏర్పాటు చేస్తామని తెలిపి ఉప్పల శ్రీనివాస్ గుప్తా,రజిని,ఇతర వాసవి క్లబ్ సభ్యులకు,రాజకీయ నాయకులకు,బంధుమిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ శోభా వెంకటేష్ గుప్తా,వాసవి క్లబ్ సభ్యులు పాండు గుప్తా,విష్ణు నందన్,ఎ రేవతి,అంజనీ దేవి,శివ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య

**ముదిగొండ మే 23 ప్రజావాణి** ముదిగొండ మండల పరిధిలోని యడవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రుద్ర పొంగు నాగేశ్వరరావు కుమారుడు రమేష్ -జ్యోతి లా కుమారుడు ఆరోన్ అన్న ప్రసన్న వేడుక కార్యక్రమం ముదిగొండ మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్ నందు దైవజనులు పాస్టర్ శ్రీధర్ అబ్రహం మరియు వి. కీర్తన గార్లచే అన్న ప్రసన్నవేడుక కార్యక్రమం ఘనంగా జరిగింది. అన్న ప్రసన్న వేడుక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపూడి బుచ్చి రామయ్య హాజరై చిన్నారిని ఆశీర్వదించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్, మండల నాయకులు కందిమల్ల వీరబాబు, వీరనారాయణ, యడవల్లి సర్పంచ్ యరకల భారతమ్మ, మాజీ సర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు బంధువులు మిత్రులు సంఘ బిడ్డలు తదితరులు పాల్గొన్నారు.

# రైతును అరిగోస పెడుతున్న రేవంత్ ప్రభుత్వం



**రాయికల్;మే 23 (ప్రజావాణి)**:రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. శనివారం రాయికల్ మండలంలోని ఆలూరు గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ నాయకులు మరియు రైతులతో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అధికారుల నిర్లక్ష్యం వల్లనే కల్లాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే పేరుకుపోయిందని అన్నారు.గ్రామంలోని రైతులు కొనుగోలు చేయాలని ధర్నా చేసిన కూడా ఇక్కడున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారని దీన్నిబట్టి ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు.రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడ్డట్టు లేదు అనే సమేత లాగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పంట పండించడం ఒక ఎత్తు అయితే దాన్ని అమ్ముకోవడం ఇంకో ఎత్తు అవుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి వెన్నెముకైనటువంటి రైతును రాజు చేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందని,తెలంగాణ ఒక దేశానికి అన్నపూర్ణగా ఉన్నదని అంటే అది కేసీఆర్ వల్లే అని అన్నారు. నెత్తి మీద ఎండ మరోవైపు కళ్లలో వడ్లు ఉన్నాయని రైతు పరిస్థితి అన్నమో రామచంద్ర లాగా ఉందని వర్షాలు తొందరగా వచ్చే అవకాశం ఉన్నందున రైతులు భయం గుప్పెట్లో పెట్టుకుని ఉంటున్నారని అన్నారు.రైతును రాజు చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారని, పంట చేతికొచ్చి అమ్ముకునే సమయమైన కూడా రైతుబంధు ఇంకా పూర్తిగా వేయలేదని రైతుబంధు సంగతేమో గాని చేతికొచ్చిన పంట కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారని అన్నారు.మేము వడ్లు కొంటున్నాం ప్రణాళికతో ఉన్నామని పేపర్ ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో పని జరగడం లేదని, బిఆర్ఎస్ హయాంలో ఒక ప్రణాళిక బద్ధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసిన నాయకుడు కేసీఆర్ అయితే రైతులను అరిగోస పెడుతున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి పాలన అని దేనికి జరుపుకుంటున్నారని, కళ్ళలలో ఉన్న వడ్లు కొనుగోలు చేయనందుకు ప్రజా పాలన సంబరాలు జరుపుకుంటున్నారా...? అని విమర్శించారు.సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా దాన్యం కొనుగోలు చేపట్టాలని కోరారు.ప్రజా పాలన పేరిట దరఖాస్తులతో ప్రజలను మభ్యపెడుతూ ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర మేల్కొని ఎక్కడ వడ్లు ఉన్నాయో త్వరగా కొనుగోలు పూర్తి చేయాలని అన్నారు..ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బర్కం మల్లేష్, ఆనంద్ రావు, సుధాకర్, ఫ్యాక్స్ చైర్మన్ రాజరెడ్డి, సర్పంచులు స్వామిరెడ్డి, గంగాధర్ నాయకులు మహమ్మద్ చాంద్, మల్లారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి ఆడెపు క్రిష్ణ,నందూనాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్ ప్రజా వాణి మే 23**:రంగారెడ్డి జిల్లా షాద్నగర్ మున్సిపాలిటీ పరిధిలో 10వార్డు రైతు కాలనీ, 11వార్డు అంబేద్కర్ విగ్రహం వద్ద గల హెచ్ఎండిఏ నిధులతో మంజూరైన నూతన అంగన్వాడి భవన నిర్మాణాలకు స్థానిక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, సిడిపిఓ ఉదయ, పట్టణ కౌన్సిలర్లు నడికుడ శ్రావణి, మురళీమోహన్(అప్పి), పెంటయ్య, దిలీప్, బచ్చలి నరేష్, కొప్పునూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్,,సాదిక్, చందు లాల్,ముబారక్ అలీ ఖాన్, సోలి పూర్ అనిల్,సయ్యద్ ఖదీర్, జయప్రకాష్, మంగ అశోక్, మంగ మధు, బాల గంగాధర్ తిలక్, బీరప్ప,రవితేజ, మహబూబ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు మృతి బాధాకరం

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు.





**రాయపోల్ మే. 24( ప్రజావాణి)**ఉమ్మడి దౌల్తాబాద్ మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. రాయపోల్ మండలం రామారం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు భౌతిక కాయానికి పూలమాలతో నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తలారి నర్సింలు దౌల్తాబాద్ ఉమ్మడి మండలం ఉన్నప్పుడే వైస్ ఎంపీపీగా ప్రజలకు అందించిన సేవలను ఎంపీ గుర్తుచేసుకున్నారు. బిజెపి పార్టీలో చేరినప్పటి నుంచి చురుకుగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశాడు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోతుందని, కానీ ఇలాంటి క్లిష్ట సమయంలో మనోధైర్యంగా ఉండాలని మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు మంకిడి స్వామి,మాజీ అధ్యక్షులు వెంకట్ గౌడ్, మాజీ ఎంపీపీ అబ్బగౌని మంగమ్మ రామస్వామి గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు టెంకంపేట నర్సింలు, నాయకులు వెంకట్ గౌడ్, గోపాల్, తూర్పు లక్ష్మణ్, ప్రసాద్, సర్పంచులు, ఉపసర్పంచ్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకుంట లో బడిబాట సందడి :

- ప్రభుత్వ పాఠశాలల అభిరుద్ధి ప్రజల సహకారం అవసరం - ఉపాధ్యాయ బృందం
- జయశంకర్ ఆశయాలతో ముందుకు సాగుతున్న బడి బాట



**అశ్వారావుపేట/తిరుమలకుంట,ప్రజావాణి న్యూస్ మే 23**:అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామం లో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్న తిరుమలకుంట పాఠశాల ఉపాధ్యాయ బృందం.తిరుమలకుంట గ్రామంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో తిరుమలకుంట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం "ప్రైవేట్ పాఠశాలలు వద్దు -- ప్రభుత్వ పాఠశాలలే ముద్దు" అనే నినాదంతో గ్రామంలోని ప్రతి వీధిలో తిరుగుతూ గ్రామస్థులను కలుసుకొని ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి అంశాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును బలపరచాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వేదికలుగా నిలుస్తున్నాయని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థులు కూడా కార్యక్రమానికి మంచి స్పందన తెలియజేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

● ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచన





**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 23 (ప్రజావాణి):**జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత శనివారం జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని తేమ శాతం (మ్యాచర్) వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే డేటా ఎంట్రీ ఆన్లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మిల్లుల వద్ద త్వరితగతిన అన్‌లోడింగ్ జరిగేలా సమన్వయం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి పాడీని రక్షించాలని ఆదేశించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండపల్లి తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎంపీడీవో దొండ కృపాకర్, సివిల్ సప్లై ఎఫ్ఐ స్వామి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అంటరానితనం రాజ్యాంగం



**మన ప్రజావాణి. మంతిని ప్రతినిధి.** మంతిని అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా దళితుల మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడు రాజ్యాంగంలో కనిపించే అంశాలు సమానత్వ హక్కు అందరు చట్టం ముందు సమానమేనన్న వాదనను రాజ్యాంగంలోస్థిర పరిచారు కులం మతం జాతి లింగం ఆధారంగా వివక్ష చేయకూడదని స్పష్టం చేశారు ఆ చూకు తనం ఆర్టికల్ 17 దళితులపై దశాబ్దాలుగా కొనసాగుతున్న అంటరానితనాన్ని చట్టపరంగా నిషేధించారు ఇది అంబేద్కర్ సామాజిక పోరాటానికి గొప్ప విజయంగా భావింపబడుతుంది పార్లమెంట్ శాసనసభల్లో దళితులకు ప్రత్యేక స్థానాలు రిజర్వ్ సీడ్స్ కల్పించారు ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవించే హక్కు మాట్లాడే హక్కు విద్య పొందే హక్కు కల్పించడం దళితుల జీవితంలో గౌరవాన్ని తీసుకురావాలని అంబేద్కర్ ప్రయత్నించాడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కేవలం చట్టపత్రం కాదు అది సమానత్వం కోసం పోరాడిన కోట్లాది అణగారిన ప్రజల ఆశయాల ప్రతిబింబం అంబేద్కర్ ఆశయాలు ముఖ్యంగా అంటరానితనం రూపుమాపాలని ఎంతగా ప్రయత్నించినా అప్పటినుండి ఇప్పటివరకు అంటరానితనం అలాగే ఉంది కాబట్టి ఇప్పటికైనా అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆచరిద్దాశీ

# చెరువులో పడి మహిళ మృతి

● మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఘటన జరిగినట్లు సమాచారం



**షాబాద్, మే 23 ( ప్రజావాణి )**షాబాద్ మండలం లోని అంతారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కావలి సుజాత భర్త వెంకటేశ్ (వయసు 40 సం)చెరువులో పడి మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఆమెకు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదని తెలిసింది.శనివారం షాబాద్ పహిల్మాన్ చెరువు వద్దకు వెళ్లిన మహిళ అనుకోకుండా నీటిలో పడిపోయినట్లు, ఈ కారణంగా ఆమె మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరిని పిర్యాదు మేరకు షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# అనుమతి లేని సీసీ కెమెరాల తొలగింపు 28వ వార్డు ప్రజల ఫిర్యాదుకు స్పందించిన


● కౌన్సిలర్ ఒగ్గు రమేష్



**జమ్మికుంట మే 23 (ప్రజావాణి):**జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డులో ప్రైవేటు వ్యక్తులు రోడ్లకు ఇరువైపులా దాదాపు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కెమెరాల ద్వారా వార్డులోని ప్రజల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని, ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయని వార్డు ప్రజలు కౌన్సిలర్ ఒగ్గు రమేష్‌కు ఫిర్యాదు చేశారుప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కౌన్సిలర్ ఒగ్గు రమేష్, వార్డు సభ్యుల కోరిక మేరకు మున్సిపాలిటీ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆ ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించే చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఒగ్గు రమేష్ మాట్లాడుతూ, సీసీ కెమెరాలు ప్రజల భద్రతకు, నేరాల నివారణకు ఉపయోగపడే విధంగా ఉండాలని, అయితే ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధంగా వాటిని వినియోగించడం సరైన పద్ధతి కాదన్నారు. నగరపంచాయతీ పోలీసు శాఖల అనుమతులు లేకుండా రోడ్లపై కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి నియంత్రణను వ్యక్తిగత ఇంట్లో ఉంచుకోవడంపై వార్డు ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారుప్రజల హక్కులు, గోప్యతను పరిరక్షించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్న ఆయన భవిష్యత్తులో ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రజల సంక్షేమంభద్రత గోప్యతకు ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీ చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారుస్థానిక ప్రజలు కౌన్సిలర్ తక్షణ స్పందనపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా సరే.. ఊరకుంట మాదే..?

- పందిళ్ళపల్లి మత్స్య సొసైటీకి ఇచ్చేది లేదు అంటున్న ఆ "అక్రమార్కులు"..!
- 2021-2022 జీవో ప్రకారం విలీనం చేశారు కదా.. అంటున్న మత్స్యకారులు
- మళ్లీ మడత పేచి పెడుతున్న కొందరు...
- చేసే వ్యవహారం చాలదన్నట్లు మరో ఏడాది కాంట్రాక్టు ఇవ్వాలట...?
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం పందిళ్ళపల్లి మత్స్య సొసైటీ పరిధిలోనే కుంటలు పెద్ద చెరువు...
- ధ్రువీకరించిన మత్స్య శాఖ సహాయ సంచాలకులు శివప్రసాద్
- మన ప్రజావాణి ప్రత్యేక కథనం 13




**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి:**చింతకాని మండలం పందిళ్ళపల్లి మత్స్య సొసైటీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా 2021 2022 సంవత్సరంలో పందిళ్ళపల్లి మత్స్య సొసైటీలో పెద్ద చెరువు తోపాటు ఊరకుంట మాదిగ కుంట కుమ్మరి కుంట లాంటి కుంటలను అధికారికంగా విలీనం చేస్తూ రాష్ట్రస్థాయి ఆదేశాలు వెలువడినప్పటికీ కొందరు గ్రామానికి చెందిందని మాకు వాటాలు ఉంటాయని మూడు గ్రామాలకు చెందిన వారికి హక్కులేదని గత ఐదు సంవత్సరాలుగా కుంటలను కబంధహస్తాలలో బందీగా చేసి ప్రతి ఏడాది ఊరకుంట మత్స్య సంపదను తమ సొంత చెరువుగా భావించి చేపల వేట కొనసాగించి ఒక్కొక్కరు సుమారు పదివేల రూపాయలు లబ్ది పొందుతూ ఉన్నట్లు పందిళ్ళపల్లి బొప్పారం గాంధీనగర్ కాలనీలకు చెందిన మత్స్యకారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలప్రకారం మత్స్య సొసైటీలో ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా కొందరు వ్యవహరిస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలో ఏ చెరువు కుంటలలో లేని ఆధిపత్యాన్ని చలాయిస్తూ మత్స్యకారుల జీవనోపాధికి గండి కొడుతున్నట్లు స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పైగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దళారీ వ్యవస్థ (కాంట్రాక్టు) లేనప్పటికీ కొందరు పందిళ్ళపల్లి సొసైటీలో సభ్యులుగాకొనసాగుతూ బహిరంగంగా చేపల చెరువును లీజుకు తీసుకోని బహిరంగంగా వ్యాపారం చేయటం విశేషం. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో సాక్షాత్తు జిల్లా మత్స్య శాఖ సహాయ సంచాలకుల ఎదుట సొసైటీ కార్యదర్శి పై మరో మత్స్యకారుడుపై దౌర్జన్యానికి దిగి బెదిరింపులకు పాల్పడ్డారని పలువురు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కాగా ఓ మాజీ అధ్యక్షుడు ఓ మత్స్యకారుడుపై దౌర్జన్యం చేస్తూ అంతు చూస్తాం లేపేస్తాం అంటూ మాట్లాడిన దృశ్యాలు మన ప్రజావాణి ఖమ్మం బ్యూరో ప్రతినిధికి చిక్కాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఇటీవల ఖమ్మం పోలీస్ కమిషనర్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన చింతకాని ఎస్ఐ దేవేందర్ శనివారం ఇరు వర్గాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సంఘంలో జరుగుతున్న పరిణామాలపై క్షుణ్ణంగా విచారించినట్లు తెలిసింది. వచ్చే ఏడాది కూడా కాంట్రాక్టు ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ పాలకవర్గం అధ్యక్ష కార్యదర్శులు కోరినట్లు తెలిసింది. మెజార్టీ సభ్యులు కాంట్రాక్టు వ్యవస్థకు వ్యతిరేకంగా ఉచిత చేప పిల్లలను చెరువుతోపాటు కుంటల్లో పోసుకొని జీవనోపాధి పొందాలని ఇటీవల జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మెజార్టీ సభ్యులు తీర్మానం చేసి ఆ తీర్మానాన్ని జిల్లా మత్స్య శాఖ కార్యాలయానికి పంపించినట్లు తెలిసింది. పందిళ్ళపల్లి మత్స్య సొసైటీ పరిధిలో పెద్ద చెరువుతోపాటు మూడు కుంటలు ఉన్నట్లు మత్స్య శాఖ సహాయ సంచాలకులు ధ్రువీకరించడం విశేషం. కాగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధ్యక్ష కార్యదర్శులు రహీం సై జానీ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మొక్కజొన్న నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్











**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (మే 23):** ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం రోజు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, లోడింగ్ మరియు రవాణా ప్రక్రియలను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉన్నదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మొక్కజొన్న నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రంలో ఉండకుండా వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొస్తున్న మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేసి వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యంగా రవాణా వాహనాలు, హమాలీల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. లారీల కొరత లేదా హమాలీల సమస్యల కారణంగా తరలింపు ప్రక్రియలో జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ అధికారులను అడిగి లారీల అందుబాటు, లోడింగ్ పనుల పురోగతి, రోజువారీ తరలింపు సామర్థ్యం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు వాహనాలు సమకూర్చి మొక్కజొన్న నిల్వలను వేగవంతంగా తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న మొక్కజొన్న తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు సంబంధించిన చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతం, వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో ఎందుకు లేరని సిబ్బందిని ప్రశ్నించి వివరణ కోరారు. సంబంధిత శాఖ అధికారులను దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టికలు, రిజిస్టర్‌లను పరిశీలించి ప్రతి ఉద్యోగి విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది సెలవుల వివరాలు, డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న వారి సమాచారం తదితర అంశాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.అవుట్ పేషెంట్ విభాగం, పరీక్షల గది, మందుల నిల్వ గది, ఇన్ పేషెంట్ విభాగాలను పరిశీలించిన కలెక్టర్ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వడదెబ్బతో చికిత్స పొందుతున్న రోగులను ప్రత్యేకంగా పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, మందులు, పర్యవేక్షణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగిలిన వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలు అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ ఉషారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద ప్రతిపాదనలు ఆహ్వానం

● గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**3వ తరగతి నుండి 8వ తరగతిలో గిరిజన బాలురు, బాలికలను చేర్చుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం క్రింద 2026-27 విద్యా సంవత్సరానికి ఖమ్మం జిల్లాలోని ప్రసిద్ధ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ హై స్కూళ్ల నుండి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం క్రింద ఎంపికకు దరఖాస్తు చేసుకునే పాఠశాలలు మంచి ప్రతిష్ట కలిగి ఉండటంతో పాటు సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలలో జిల్లా/రాష్ట్ర స్థాయి విజయాలు సాధించి, నాణ్యమైన విద్య అందిస్తున్న గుర్తింపు కలిగి ఉండాలని తెలిపారు. గత ఐదేళ్లుగా నిరంతరంగా 7వ, 10వ తరగతి పరీక్షల్లో 90 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో పాటు కనీసం 50 శాతం ఫస్ట్ క్లాస్ ఫలితాలు నమోదు చేసి ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీలు, హాస్టళ్లు, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, ఫర్నిచర్, ఆటస్థలాలు తదితర తగిన మౌలిక సదుపాయాలు ఉండాలని తెలిపారు.

పాఠశాల, హాస్టల్ భవనాలకు ధృవీకరించిన భవన ప్రణాళిక (సర్టిఫైడ్ ప్లాన్) తప్పని సరిగా ఉండాలని పేర్కొన్నారు.విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందించేందుకు తగిన వైద్య సదుపాయాలు కలిగి ఉండాలని తెలిపారు. తరగతి గదులు, హాస్టల్ భవనాలు అనుబంధ సదుపాయాలన్నీ ఆర్‌సీసీ పైకప్పుతో, మంచి ఫ్లోరింగ్, తగిన గాలి వెలుతురు కలిగి ఉండాలని,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన స్థలం ఉండాలని చెప్పారు.విద్యాశాఖ/సీబీఎస్ఈ నిర్దేశించిన నమూనా ప్రకారం తగిన సంఖ్యలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలని తెలిపారు. కనీసం 50 శాతం బోధనా సిబ్బంది మూడు సంవత్సరాలకు పైగా అదే విద్యాసంస్థలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులుగా ఉండాలని పేర్కొన్నారు.పాఠశాలకు సంబంధిత అధికారుల నుండి తాజా గుర్తింపు అనుబంధం తప్పనిసరిగా ఉండాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి ఎంపిక పరిగణనలోకి రావడానికి కనీసం ఐదేళ్లుగా గుర్తింపు పొందిన పాఠశాలగా కొనసాగి ఉండాలని తెలిపారు.గిరిజన విద్యార్థులకు వసతి, భోజనం ఇతర సదుపాయాలు పాఠశాలలోని ఇతర విద్యార్థులకు కల్పించే విధంగానే సమానంగా అందించాలని, ఎటువంటి వివక్ష చూపరాదని స్పష్టం చేశారు.ప్రతి గిరిజన విద్యార్థికి సంవత్సరానికి 42 వేలు చొప్పున ప్రభుత్వ ఆమోదిత బడ్జెట్ మేరకు ఆన్‌లైన్ ద్వారా పాఠశాలకు చెల్లించబడుతుందని తెలిపారు. ఈ మొత్తంలో బోర్డింగ్, లాడ్జింగ్, ట్యూషన్ ఫీజులు, సహపాఠ్య కార్యక్రమాలు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర రెసిడెన్షియల్ విద్యార్థులకు సాధారణంగా అందించే అన్ని సదుపాయాల వ్యయాలు ఉంటాయని పేర్కొన్నారు.ఎంపికైన పాఠశాలలకు గిరిజన విద్యార్థులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పై అర్హతలు కలిగిన పాఠశాల యాజమాన్యాలు ఖమ్మం కలెక్టరేట్ లోని ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమం శాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు ఫారాలను పొంది తిరిగి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి ఆ ప్రకటనలో తెలిపారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ప్రొవిజినల్ ఆఫర్ లెటర్లను అందజేసిన జిల్లా కలెక్టర్

- ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ముందుకు సాగాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్









**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (మే 23):**పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుండి శనివారం వరకు యువజనోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం రోజు ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 04-05-2026న ఖమ్మంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన 105 మంది యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ ప్రొవిజినల్ ఆఫర్ లెటర్లను అందజేశారు. యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. యువత అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని అన్నారు. అనంతరం సీఎం కప్ -- 2026తో పాటు ఇతర క్రీడా పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, సమ్మర్ క్యాంపుల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన యువతకు జిల్లా కలెక్టర్ మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా యువత ప్రతిభ చాటుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ టూరిజం రూపొందించిన "తెలంగాణ టూరిజం బ్రాండ్ కిట్ -- తెలంగాణ జరూర్ ఆనా"ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక విశేషాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ బ్రాండ్ కిట్ ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా యువతకు టూరిజం శాఖ అందిస్తున్న "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ", "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ" కోర్సుల గురించి కలెక్టర్ వివరించారు. టూరిజం రంగంపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో-ఆర్డినేటర్ డా. పి. నాగరాజు (డీడీ, మ్యూజియమ్స్)ను ఫోన్ నెంబర్లు 9849905722, 9849905723 ద్వారా లేదా archaeologydht@gmail.com ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి యం.పరంధామ రెడ్డి, జీఎం డిఐసి మధుసూదన్ రెడ్డి, పిఐఓ పృథ్వి, ప్రశాంతి నగర్ సర్పంచ్ లైలా, శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ వనజ క్రీడ కోచ్ లు: అబ్దుల్ నబి, కాసి హుస్సేన్, నాగేశ్వర్ రావు, లగడపాటి రమేష్, వై.వి.శ్రీనివాస్, డానియల్ రాంబాబు, నవీన్, గిరి ప్రసాద్, నాగేంద్ర, జగన్నాథ్, పాపరాజు, శ్రీనివాస్, నాగ శివాజీ, మల్లికార్జున్, ప్రమీల, రవి కిరణ్, అఖిల్, కార్యాలయ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటిఎంను ధ్వంసం చేసిన దుండగులు

- చోరీకి యత్నం - పోలీసులకు సమాచారం అందగానే దొంగలు పరారు




**షాద్ నగర్ ప్రజా వాణి మే 23:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం సెంటర్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి విఫల యత్నం చేశారు. రాత్రి సమయంలో కొంతమంది దుండగులు బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్ లో అద్దాలు ధ్వంసం చేశారు. చోరీకి ప్రయత్నం చేస్తున్న సమయంలో వంశీ అనే ఒక యువకుడు వారిని గమనించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందజేశాడు. దీంతో దొంగలు అక్కడి నుండి పరాలైనట్లు పట్టణ సీఐ సీతారాం తెలిపారు. సంఘటనపై దర్యాప్తు జరుగుతున్నట్లు అయినా పేర్కొన్నారు..

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేసిన తహరాపూర్ సర్పంచ్ కుక్కల సరోజన



**ప్రజావాణి శాయంపేట మండలం,** తహరాపూర్ (మందారిపేట) గ్రామంలోని పోచమ్మకుంట, తురుకకుంట ప్రాంతాలలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామసర్పంచ్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు ఉదయం 5 గంటల నుండి 10 గంటల లోపే పనులను పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్మికులకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి పనులను పరిశీలించడానికి వచ్చిన ఏపీఓ అనిత తో మాట్లాడిన సర్పంచ్, కార్మికులకు వేతనాలు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ సంవత్సరం అనేక మంది కార్మికుల జాబ్ కార్డులు తొలగిపోవడంతో పేద కుటుంబాలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నాయని, వారికి వెంటనే పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్, ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, చలివాగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కుక్కల తిరుపతి, బదుగు సునీల్, గాజర్ల శంకర్, వంగల గణపతి వలుస పృథ్వి, కొమ్ముల తిరుపతి, కుక్కల రాజకుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలకు మహర్దశ

- పర్యాటక కేంద్రాలుగా గిరిజన గ్రామాలను ఎంపిక
- మరింత అభివృద్ధి చెందుతున్న ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలు
- గిరిజన గ్రామాలు పూర్తిస్థాయి పల్లె వాతావరణం ప్రజలకు కనువిందు కలిగేలా చర్యలు








**భద్రాచలం/మన ప్రజావాణి (మే 23):** పర్యాటకశాఖ తరఫున గిరిజన గ్రామాలలో పర్యాటకులు ఎక్కువ శాతం పర్యటన చేసే గ్రామాలు పూర్తిస్థాయి పల్లె వాతావరణం కనువిందు కలిగేలా ఉండే గిరిజన గ్రామాలు, రాత్రి బస చేసే విధంగా ఉండే గ్రామాలు గుర్తించి పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు భారత ప్రభుత్వం పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పంపించాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ ఐఏఎస్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం రోజు హైదరాబాదులోని పర్యాటక శాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఐటిడిఏ పిఓలతో ధర్తీ జుగా కింద గిరిజన ప్రాంతాలలో హోమ్ స్టేల అభివృద్ధి క్రింద ప్రాజెక్టు అమలు, పర్యవేక్షణ కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బిఎం, అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్ రెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ వివిధ జిల్లాలలోని గిరిజన గ్రామాలలో పర్యాటకులు సందర్శించే గ్రామాలు పూర్తిస్థాయిలో పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఉండే గ్రామాలు పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా గ్రామాలు గుర్తించి పర్యాటకులు బస చేయడానికి అనుకూలంగా ఉండాలని, ఆ గ్రామాలలో తప్పనిసరిగా వాటర్ ఫాల్స్, దేవాలయాలు, గిరిజన కల్చర్, హార్టికల్చర్ అలాగే గిరిజనులు తయారు చేసే వివిధ రకాల ఆర్ట్, క్రాఫ్ట్ కి సంబంధించిన చిన్న తరహా పరిశ్రమలు లాంటివి ఉండేలా చూడాలని అన్నారు. పర్యాటకులు గ్రామాన్ని సందర్శించగానే జీవం ఉట్టిపడేలా గ్రామంలోని ప్రజల మర్యాద మన్ననాలతో పాటు గ్రామం శానిటేషన్ పరంగా పరిశుభ్రంగా ఉండాలని అలాగే నిరుద్యోగులైన గిరిజన యువతకు టూరిస్టులకు పర్యాటక స్థలాలకు సంబంధించిన వివరాలు తెలిసే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. దానికి సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల 28 వరకు పర్యాటక శాఖకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఉందని, భక్తులతో పాటు పర్యాటకులు ప్రతిరోజు అధికంగా దేవస్థానం దర్శనంనకు వస్తూ ఉంటారని, అలాగే గిరిజన గ్రామాలలో పర్యాటక స్థలాలను గుర్తించడానికి త్వరలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పర్యాటక స్థలాలు మారుమూల ప్రాంతాలలోని బెండలపాడు, కిన్నెరసాని, గోగుల పూడి, బొజ్జిగుప్ప గ్రామాల గురించి, అధికారుల సూచనల ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పిస్తామని ఐటిడిఏ పిఓ బి. రాహుల్ సెక్రెటరీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించినా.. సేవించినా కఠిన చర్యలు -గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు





**గోదావరిఖని, మన సమగ్ర ప్రజావాణి మే 23:**గంజాయి విక్రయించినా, సేవించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీ,సిర్కే చౌరస్తా, ఆటోస్టాండ్, టీస్టాళ్లు, పాన్ షాపులు,ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతం,కేకే నగర్‌తో పాటు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజ్‌కుమార్,నార్కోటిక్ బృందం సంయుక్తంగా శనివారం జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... గంజాయి,ఇతర మత్తు పదార్థాలను సేవించినా, విక్రయించినా,రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాదరావు, నార్కోటిక్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజ్‌కుమార్,పెద్దపల్లి నార్కోటిక్ టీమ్ సిబ్బంది,డాగ్ స్క్వాడ్ సిబ్బంది,స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోని సాంస్కృతిక కార్యక్రమాలు




**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 23 (ప్రజావాణి)** దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (23.05.2026) మహతీ ఆర్ట్స్ థియేటర్స్, సికింద్రాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమములో గణేశకౌత్వం, శివాష్టకం, మూషికవాహన, ఓం నమశ్శివాయ, కాలభైరవాష్టకం, శివశంభో, సరస్వతీ మాతస్తుతి, తదితర గీతాలకు శృతి, అవిజ్ఞ, ప్రణవి, సహస్ర, యశ్విత, అక్షిత తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

# మండుటెండల్లో కూలీలకు చల్లని భరోసా

- ముల్కనూర్‌లో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ
- కూలీల ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న సర్పంచ్, పాలక వర్గం



**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):**మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమై ఉన్న కూలీలకు ముల్కనూర్ గ్రామ పంచాయతీ అండగా నిలిచింది. గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి కార్మికులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తీవ్రమైన ఎండల్లో పని చేస్తున్న సమయంలో అందించిన మజ్జిగ తమకు ఎంతో ఉపశమనాన్ని కలిగించిందని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య మాట్లాడుతూ, ఎండాకాలంలో ఉపాధి హామీ కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండుటెండల్లో పనిచేసే కార్మికులకు తాగునీరు, మజ్జిగ వంటి అవసరమైన సదుపాయాలు అందించడం గ్రామ పంచాయతీ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే అక్కడే కార్మికులతో మాట్లాడి వారికి రావాల్సిన ఉపాధి హామీ బిల్లులు వారం వారం సక్రమంగా జమ అవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్ అధికారులను ఆదేశించారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు జెట్టి లత, గట్టు రేణుక, పందిపెల్లి కీర్తన, వంగల రాము, పిట్టల తిరుపతి, ఇరుకుల సృపిత్ పాల్గొన్నారు. అలాగే ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్ మారెళ్ల రేణుక, కారోబార్ మరెళ్ల రాజేష్ హాజరయ్యారు. గ్రామ నాయకులు కయ్యం వీరయ్య, భూస చంద్రయ్య, పందిపెల్లి రాములు, కొమురయ్య, పందిపెల్లి శ్రీకాంత్, బావండ్ల పవన్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

# ఓదెల మండల కాంగ్రెస్ అధ్యక్షుడి మాతృమూర్తి అంత్యక్రియల్లో

- ప్రభుత్వ విప్ విజయరమణరావు పాల్గొన్నారు





**మన సమగ్ర ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 23**పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి మాతృమూర్తి మూల సరోజన అనారోగ్య కారణాలతో మరణించడంతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు వారి స్వగ్రామమైన కోమిర గ్రామానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మూల సరోజన మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే ప్రేమ్ సాగర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన లక్ష్మణ్ రాజ్





**మన ప్రజావాణి పుంగనూరు, మే 23** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాస రావ్ ను ప్రముఖ నాయకుడు లక్ష్మణ్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా చేరే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అలాగే పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడం, యువతను రాజకీయాల్లోకి ప్రోత్సహించడం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని పెంపొందించడం అవసరమని లక్ష్మణ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో కొనసాగిందని, నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని నాయకులు నిర్ణయించినట్లు తెలిసింది. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జనప్రియ హోటల్ లో పనిచేస్తున్న ఉద్యోగి అనుమానాస్పద మృతి



**మన సమగ్ర ప్రజావాణి మే 23 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న జనప్రియ ఉడిపి హోటల్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్ (22) అనే వ్యక్తి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. మృతుడు కంగ్టి మండలం చింతామణి తండాకు చెందినవాడిగా గుర్తించారు. హోటల్ గదిలో మృతదేహం లభ్యమవడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు హోటల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఘటన స్థలంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి యువతకి ఆదర్శము దేవ

● సామాజిక కార్యకర్త డా లక్ష్మి వీరమల్లు





**మేడిపల్లి మే 23( మన ప్రజావాణి)** ఆకలి తో అలమటించే వారికి అనునిత్యం తనకి తోచిన విదంగా వంద లాది మందికి ఎక్కడ వీలు అయితే అక్కడ చెట్టు నీడను ఆసరా చేసుకుని ఉచితంగా అన్న ప్రసాదం అందిస్తూ ఎందరికో ఆదర్శ వంతంగా నిలుస్తున్నాడు. ఒక సదారణ రైతు బిడ్డ సాఫ్ట్ వేరు ఉద్యోగి దేవ అని సామాజిక కార్యకర్త డా లక్ష్మివీరమల్లు దేవను పలకరించి వివరాలు అడిగి తెలుసుకొని వంద లాది ప్రజల కు అన్నదానం చేశారు.దేవను మనసారా అభినందించి అక్కడి యువతకు కూడా ఇట్టి విషయం చెప్పి సమాజంలో యువత పాత్ర చాలా కీలకం అని అన్ని రంగాలో పట్టు సాధిస్తూ సహాయం చేస్తూ ఆదర్శంగా నిలువాలి అని కోరారు.

# విజయవాడలో ఎన్సీపీ పార్టీ ఎన్.వై.సి కార్యకర్తల సమావేశం



**హైదరాబాద్/మన ప్రజావాణి (మే 23):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ మహానగరంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి నాగరాజు అధ్యక్షతన ఎన్సీపీ పార్టీ, ఎన్డీఏ మహాకూటమి ఎన్.వై.సి 10 నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ ఇన్‌చార్జ్, ఎన్సీపీ పార్టీ ఎన్.వై.సి జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జ్ మద్దిశెట్టి సామేలు హాజరై మాట్లాడుతూ ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పార్టీని పెద్ద ఎత్తున బలోపేతం చేయాలని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 27 జిల్లాల్లో పూర్తి కమిటీలు ఏర్పాటు చేసే బాధ్యతను ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి ఒడిశా రాష్ట్రంలోని మూడు జిల్లాల నుంచి కూడా పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తేనేటి ఇమ్మానియేల్, పల్లి రత్నం, గాంధీ తిరుపతిరావు, అద్దంకి నియోజకవర్గం నుంచి కురిచేట్టి రాజ్యలక్ష్మి, నందిగామ నుంచి ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షురాలు పఠాన్ మున్ని, షేక్ సైదాబీ, మీరాభి, జగ్గంపేట నియోజకవర్గం నుంచి లక్ష్మీ కోటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గం నుంచి మలమంటి వెంకటరత్నం, బాణవతు గాంధీ, పలగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుడు అరెస్ట్..

● బంగారం, వెండి వస్తువుల స్వాధీనం




**అశ్వాపురం/మన ప్రజావాణి (మే 23):** అశ్వాపురం మండల ఎస్సీ కాలనీలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేధించి, ఒక నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10వ తేదీన ఎస్సీ కాలనీకి చెందిన నల్లగట్ల ప్రశాంత్ తన బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో అతని ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందడంతో, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఎస్సీ కాలనీకి చెందిన రాగం అశోక్, ఇసంపల్లి జంపయ్యలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడు రాగం అశోక్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 35 గ్రాముల బంగారు వస్తువులు,206 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ఇసంపల్లి జంపయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు ఊరికి వెళ్లే ముందు విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, అలాగే ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# మండుటెండల్లో మతిస్థిమితం లేని మనిషికి సహాయం చేసి మానవత్వం చాటిన మనసున్న మహా రాజు ప్రభు.

● గత కొన్ని నెలలుగా జమ్మికుంట ఫ్లైఓవర్ పైన నివాసాన్ని ఏర్పరచుకొని జీవిస్తూ ఉన్నాడు



**జమ్మికుంట మే 23 (ప్రజావాణి)**మండుటెండల్లో ఉంటున్న అతన్నీ గమనించిన అంతర్జాతీయ క్రీడాకారులు జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులువోజ్జ రాజు ఉపాధ్యక్షులు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) లు ఆయన వద్దకు చేరుకొని ఆయనకి ఆహారం నీళ్ల బాటిల్ అందజేసి, మానవత్వాన్ని చాటుకున్నారుఅతని తో మాట్లాడి పూర్తివివరాలు తెలుసుకున్నారు అతనిది స్వగ్రామం జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన ప్రశాంత్ గా చెప్పారుగత కొంతకాలంగా మానసిక స్థితి బాగుండకపోవడంతో పిచ్చివాడిలా ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనే రాత్రింబవళ్లు జీవనం గడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారుఈసందర్భంగా జమ్మికుంటస్పోర్ట్స్. క్లబ్అధ్యక్షులు ఉపాధ్యక్షులు రాజుప్రభుమాట్లాడుతూజమ్మికుంట ఇన్స్పెక్టర్, తాసిల్దార్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకొని వారి కుటుంబ సభ్యులను పిలిపించి, మానసిక రోగిగా మారిన ప్రశాంత్ ను హైదరాబాదులోని ఎర్రగడ్డ (పిచ్చాసుపత్రి) వైద్యం చేయిస్తే సంపూర్ణ మానసిక, శారీరక ఆరోగ్యవంతులుగా అవుతారని, ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వాళ్ళు అవుతారని విజ్ఞప్తి చేశారు.

# పాలేరు నియోజకవర్గంలో “షాడో”ల జోక్యం..?

● సర్పంచ్ అధికారాలను అడ్డుకుంటున్నారని ఆర్మీ రవి ఆరోపణ.

● గ్రామాభివృద్ధి నిలిచిపోతోందంటూ ప్రెస్‌మీట్‌లో ఆవేదన..



**పాలేరు(తిరుమలాయపాలెం), ప్రజావాణి, మే 23:**తిరుమలాయపాలెం మండలం సుద్దవాగు తండా గ్రామపంచాయతీలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయ జోక్యాలు అడ్డంకిగా మారుతున్నాయని సర్పంచ్ బానోత్ రవి అలియాస్ ఆర్మీ రవి ఆరోపించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో కలిసి నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను వెల్లడించారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో కొందరు వ్యక్తులు “షాడో ఎమ్మెల్యేలు”లా వ్యవహరిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధుల పనితీరులో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. గ్రామానికి రావాల్సిన అభివృద్ధి నిధులను అడ్డుకోవడంతో పాటు గ్రామపంచాయతీ పనులు సక్రమంగా సాగకుండా అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకంలో కూడా సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా పనులు నిర్వహిస్తున్నారని, గ్రామ ప్రజలకు అందాల్సిన మౌలిక వసతులు రాజకీయ జోక్యాల వల్ల నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. “సర్పంచ్ మాట వినాల్సిన అవసరం లేదు.. మా మాటే వినాలి” అంటూ కొందరు మండల అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారాలకు సంబంధించి తన వద్ద పూర్తి స్థాయి ఆధారాలు ఉన్నాయని ఆర్మీ రవి తెలిపారు. ప్రస్తుతం “షాడో ఎమ్మెల్యే”గా వ్యవహరిస్తున్న వ్యక్తి గతంలో తనపై హత్యాయత్నానికి కుట్ర పన్నాడని కూడా ఆరోపించారు. ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ గ్రామ ప్రజల హక్కుల కోసం వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ వ్యవస్థను బలహీనపరిచే విధంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపించాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు చట్టబద్ధ రక్షణ కల్పించాలని ఆయన కోరారు

# రాజకీయ స్వార్ధము తోనే స్థానికత పై ఎమ్మెల్యే గౌతు శిరీష పై విమర్శలు చేశారు..

■ మద్యం అధిక ధరలకు ఎమ్మెల్యే కుటుంబానికి ఆపాదించడం వాస్తవ విరుద్ధము ..

■ పీఏసి ఎస్ బ్యాంక్ లో అవినీతి పై నివేదిక వచ్చే వరకు ఆగకుండా అసత్య ప్రచారం చేయడం తగదు

■ శ్రీధర్ సార్ ఓపిక పడితే సహకార సంఘం బ్యాంక్ నిధులు దోపిడి పై నిజాలు వెలుగులోకి వస్తాయి..

■ మాజీ పీఏ సిఎస్ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ పై మండి పడ్డ

■ మూడు మండలాల పీఏ సిఎస్ ప్రస్తుతం అధ్యక్షులు

■ పలాస, మందస, వజ్రపు కొత్తూరు మండలాకు చెందిన ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు .




**పలాస ప్రజావాణి ప్రతినిధి** పలాస ఉద్దానం లో రాజకీయ స్వార్థము కోసము అసత్య ప్రచారాలు చేస్తున్నారని, స్థానికత పేరుతో ఎమ్మెల్యే గౌతు శిరీష పై తప్పుడు ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ పై మూడు మండలాలకు చెందిన ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు పలాస అధ్యక్షుడు వంకల కూర్మారావు, వజ్రపు కొత్తూరు మండలం సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షులు కణితి సురేష్ చౌదరి, మందస మండలం సహకార సంఘం బ్యాంక్ అధ్యక్షులు తమిరియా భాస్కర్ లు దువ్వాడ శ్రీధర్ పై తీవ్ర ఆగ్రహము వ్యక్తము చేశారు.మద్యము అమ్మకాలు అధిక ధరలకు అమ్మకాలపై ఎమ్మెల్యే కు ఆపాదించడం వాస్తవ విరుద్ధము అని వారు అన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష ప్రస్తావించిన పీఏ సిఎస్ వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థానికత అంశాలపై వచ్చిన విమర్శలను ఖండించారు. ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వ్యవస్థలో జరిగిన అంశాలపై మాత్రమే స్పందించారని తెలిపారు. మద్యం ధరలు, వ్యాపారాలకు ఎమ్మెల్యే కుటుంబాన్ని అనుసంధానం చేయడం ఆధారరహితమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధమైన పాలన కొనసాగుతోందని అన్నారు. స్థానికత పేరుతో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని పేర్కొన్నారు. విచారణ జరిగి వాస్తవాలు బయటకు వస్తే అందరూ అంగీకరించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అంశాలను ప్రస్తుత ప్రభుత్వంపై మళ్లించే ప్రయత్నం తగదన్నారు. ముప్వల నాగేష్ ఘటన వంటి అంశాలపై గత పాలకులు కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు, విద్య, సాగునీరు, రవాణా రంగాల్లో పనులు ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. స్థానికతపై విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గౌతు కుటుంబంపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఆ కుటుంబం దశాబ్దాలుగా ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుందని, ప్రజాభిమానం వల్లే ఎన్నికల్లో మద్దతు లభిస్తోందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యల కంటే అభివృద్ధిపై చర్చ జరగాలని సూచించారు.బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ లబ్బ రుద్రయ్య మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలతో రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నించడం సరికాదన్నారు. పలాస నియోజకవర్గానికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న నాయకత్వంపై అసత్య ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. పీఏ సి ఎస్ లో అవకతవకలు జరిగాయా లేదా అన్నది అధికారిక విచారణ ద్వారా బయటకు వస్తుందని, ముందుగానే ఉలిక్కిపడి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం ప్రజల్లో ప్రశాంత వాతావరణం ఉందని, అభివృద్ధి పనులే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. పలాస పీసీఎస్ చైర్మన్ వంకల కుర్మారావు మాట్లాడుతూ పి ఎ సి ఎస్ అంశాలపై మాట్లాడిన వెంటనే కొందరు ఎందుకు ఆందోళన చెందుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎంక్వైరీ పూర్తయ్యాక నిజాలు బయటకు వస్తాయని చెప్పారు. రెండు సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలే చూస్తున్నారని తెలిపారు. ప్రజా సేవ ముఖ్యం గతం నుండి ఇప్పటివరకు జరిగిన కార్యకలాపాలపై ఆడిట్, విచారణ ప్రకారం వాస్తవాలు వెల్లడిస్తామని తెలిపారు.చైర్మన్లు సమిష్టిగా మాట్లాడుతూ -- ప్రజల్లో అపోహలు కలిగించే రాజకీయ వ్యాఖ్యలు కాకుండా, అభివృద్ధి, సంక్షేమం, ప్రజా ప్రయోజనాలపై చర్చ జరగాలని సూచించారు. అలాగే ప్రాథమిక సహకార సంఘం కు సంబంధించిన అంశాలు విచారణలో ఉన్నందున అధికారిక నివేదిక వెలువడే వరకు శ్రీధర్ ఓపిక పట్టాలని కోరారు.

# కూరగాయల సముదాయాన్ని ప్రజలకు వ్యాపారులకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని వినతి

■ జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు నమస్కారం

■ మహోదయులకువినయపూర్వక

■ జమ్మికుంట ప్రజల తరపున పట్టణ మహిళా కాంగ్రెస్.పార్టీఅధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్



**జమ్మికుంట మే 23 (ప్రజావాణి):**ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. జమ్మికుంట పట్టణం పరిసర ప్రాంతాలలో కూడా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ఉండటంతో ప్రజలు, రైతులు, కూరగాయల వ్యాపారులు ఎన్నో కష్టాలు పడుతున్నారుముఖ్యంగా రైతులు, రిటైల్ హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు నడిరోడ్డుపైనే ఎటువంటి సరైన సదుపాయాలు లేకుండా మండుటెండలో కూరగాయలు అమ్ముకోవడం చాలా బాధాకరం. ప్రజలు కూడా ఎండలో నిలబడి కూరగాయలు కొనడానికిఇబ్బందులు ఎదుర్కొంటున్నారుఅధిక ఉష్ణోగ్రతల కారణంగా కూరగాయలు త్వరగా పాడవుతూ రైతులు వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారుఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన జమ్మికుంట కూరగాయల సముదాయం ప్రస్తుతం నిరుపయోగంగా మిగిలిపోవడం చాలా విచారకరం. ఆ సముదాయంలో వ్యాపారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా షెడ్లు, టాయిలెట్స్, పెద్ద పెద్ద ఫ్యాన్లు మరియు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబడినాయి. ఇంత మంచి సదుపాయాలు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించకపోవడం ప్రజలకు, వ్యాపారులకు నష్టదాయకంగా మారిందికాబట్టి పాలకవర్గ సభ్యులు ప్రజల ఆరోగ్యం, రైతుల సంక్షేమం, వ్యాపారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని జమ్మికుంట పట్టణంపరిసర ప్రాంతాలకు చెందిన అన్ని కూరగాయల వ్యాపారులు రైతులు కూరగాయల సముదాయంలోనే తమ వ్యాపారాన్ని నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హృదయపూర్వకంగా మనవి చేసుకుంటున్నాముప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన ఈ కూరగాయల సముదాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తే ప్రజలకు ఎండల నుంచి ఉపశమనం కలగడంతో పాటు రైతులు, వ్యాపారులు కూడా సురక్షిత వాతావరణంలో తమ వ్యాపారాన్ని కొనసాగించగలరు అందువలన ఈ సమస్యపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జమ్మికుంట ప్రజల తరపున వినయపూర్వకంగా కోరుచున్నాము

# వెంకటాద్రి నగర్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు మజ్జిగ వితరణ



**జమ్మికుంట, మే 23 (ప్రజావాణి):**ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చే భక్తుల కోసం వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారుపట్టణంలోని వెంకటాద్రి నగర్ లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు శనివారం రోజున అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఎండాకాలం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో భక్తులకు మజ్జిగ దాత కల్వల దీప్తి కిషన్ రెడ్డి సహకారంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశముల మేరకు పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు కడప జిల్లాకు నోడల్ అధికారి నియామకం.జిల్లా ఎస్పీ



**వై.ఎస్.ఆర్ కడప జిల్లా ,(మే23 ప్రజావాణి)** :ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హై కోర్ట్ ఉత్తర్వుల మేరకు, ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ హరీష్ కుమార్ గుప్తా IPS.మరియు చీఫ్ ఆఫీస్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం,జిల్లాలో గోవధ మరియు జంతుబలులు నిషేధమని జిల్లా ఎస్.పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఆంధ్రప్రదేశ్ గోవధ మరియు జంతుబలుల నిషేద చట్టం 1977 ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు.భారతదేశంలో గోవధ మరియు జంతుబలులు నిషేధమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని, హెచ్చరించారు.జంతువుల సంరక్షణ చట్టాల అమలు సక్రమంగా జరగడానికి గాను ఇన్స్పెక్టర్ శ్రీ టి.రెడ్డెప్ప ని కడప జిల్లా స్థాయి నోడల్ అధికారి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జంతువుల అక్రమ రవాణా మరియు అక్రమ వధ విషయంలో ప్రజలకు ఏవిధమైన సమాచారము ఉన్న యెడల ప్రత్యక్షంగా గానీ లేదా ఫోన్ ద్వారా జిల్లా స్థాయి నోడల్ అధికారి అయిన ఇన్స్పెక్టర్ గారైన శ్రీ టి.రెడ్డెప్ప ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9121100689 కు పిర్యాదు చేయగలరని, కడప జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు.

# చరిత్ర సృష్టించిన హెన్రిచ్ క్లాసెన్




సౌతాఫ్రికా మాజీ బ్యాటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 600 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 51 పరుగులు చేయడం ద్వారా ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో 4వ స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేస్తూ 600కి పైగా పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా క్లాసెన్ చరిత్ర సృష్టించాడు.ఆర్‌సీబీ మ్యాచ్‌కు ముందు హెన్రిచ్ క్లాసెన్ 4వ స్థానం లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 ఇన్నింగ్స్‌లలో 555 పరుగులు సాధించాడు. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 4వ స్థానంలో ఆడిన క్లాసెన్ కేవలం 24 బంతుల్లోనే మెరుపు వేగంతో 51 పరుగులు చేసి ఈ టోర్నమెంట్‌లో 600 పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే రిషబ్ పంత్‌ను అదిగమించాడు. ఐపీఎల్ 2018లో పంత్ 11 ఇన్నింగ్స్‌లలో 579 పరుగులు చేశాడు. ఈ

# లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ




రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్‌కు స్పెషలే. మరోసారి దీనిని హిట్‌మ్యాన్ నిరూపించుకున్నాడు. ఇంతటి బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్‌కు రోహిత్ 'సారీ' చెప్పాడు. తనను కలవలేకపోయానని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్‌కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవధుల్లేకుండా పోయాయి!కోల్‌కాతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి రీసెంట్‌గా కేకేఆర్‌తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్‌ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్‌మ్యాన్‌ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్ దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ అమ్మాయి ఏడవడం రోహిత్‌ను కలచివేసినట్లుంది.

దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్‌మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్‌లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్స్ ఈడెన్ గార్డెన్స్‌కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్ రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్ స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్‌మ్యాన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చడని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఇక ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ముంబయికి ఇంకా ఒక మ్యాచే మిగిలింది. ఆదివారం (మే 24) మధ్యాహ్నం 3.30 గంటలకు రాజస్థాన్ రాయల్స్‌తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌కు ముంబయి వాంఖడే స్టేడియం వేదిక కానుంది. ఇది ముంబయికి పెద్దగా అవసరం లేకున్నా, రాజస్థాన్‌కు మాత్రం కీలకమైన మ్యాచ్. ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక నెగ్గాల్సిందే! ప్రస్తుతం 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ 16 పాయింట్లతో బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఓడితే పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఛాన్స్ ఉంటుంది.రోహిత్ ఈ మ్యాచ్‌లో బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా 8 మ్యాచ్‌లు ఆడిన హిట్‌మ్యాన్ 283 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50+ స్కోర్లు నమోదు చేశాడు. ఇక ఆఖరి మ్యాచ్‌లో రాజస్థాన్‌పైనా భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగిపోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్ తప్పితే మళ్లీ వచ్చే ఏడాదే రోహిత్ టీ20ల్లో కనిపిస్తాడు.

# రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు భారీ ఊరట



గత కొంతకాలం నుంచి వివాదాల్లో చిక్కుకున్న భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. మే 30 నుంచి జరగనున్న ఏషియన్ గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు మహిళా రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా రెజ్లర్లను దూరం పెట్టడానికి మాతృత్వం (తల్లి కావడం) ఒక ప్రాతిపదిక కాకుండా చట్టం చూసుకుంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఆసియా క్రీడలకు భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్దేశించిన ప్రమాణాలు వివక్షపూరితంగా ఉన్నాయని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక మహిళా రెజ్లర్ గర్భధారణ, ప్రసవానంతర కాలం నాటి ప్రయాణం అసాధారణమైన శారీరక సవాళ్లతో కూడి ఉంటుందనే విషయాన్ని తిరస్కరించలేమని హైకోర్టు పేర్కొంది. అయితే దీని తీవ్రతను క్రీడా రంగంలో తరచుగా గుర్తించరని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను దూరం పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'వినేష్ ఫోగాట్ ప్రసూతి సెలవులో ఉన్నందున భారత రెజ్లింగ్ సమాఖ్య మినహాయింపు సెలక్షన్ పాలసీని పూర్తి చేయలేకపోయారు. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను బహిష్కరించడానికి లేదా పక్కన పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని' ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కూడా ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ చర్యను ద్వేషపూరితమైనదిగా కోర్టు అభివర్ణించింది. ఆమె విషయంలో పదాల ఎంపికపై సైతం కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వైపు నుంచి దురుద్దేశం ఉందని స్పష్టంగా అర్థమవుతోందని కోర్టు వ్యాఖ్యానించడం హాట్ టాపిక అవుతోంది. 2025లో మెడల్స్ గెలిచిన వారికే అర్హతను పరిమితం చేసేలా నిబంధనలు ఉన్నాయని ధర్మాసనం తప్పుపట్టింది.



## 200 స్కోర్లు సాధించిన జట్టుగా సన్‌రైజర్స్ ప్రపంచ రికార్డు

ఉప్పల్ వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌హెచ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ పరుగులు సాధించిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటి వరకు 9 సార్లు 200 ప్లస్ పరుగులు చేసింది.ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై రెండేసి సార్లు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఒక్కోసారి 200కి పైగా పరుగులు సాధించింది.

# సచిన్‌లో చూసిందే వైభవ్‌లో కనిపించింది

- భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే



రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే ప్రశంసల జల్లు కురిపించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌లో చూసిన తెగువ తనకు వైభవ్ సూర్యవంశీలో కనిపించిందని తెలిపాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం అలవోకగా ఎదుర్కొంటుండటం తనను విపరీతంగా ఆకట్టుకుందన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్నాడు. 13 ఇన్నింగ్స్‌లలో 44.54 సగటు, 236.32 స్ట్రైక్‌రేట్‌తో 579 పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒక సీజన్‌లో భారత బ్యాటర్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే కావడం గమనార్హం.తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ ఆటతీరుపై స్పందించిన కిరణ్ మోరే.. సచిన్‌తో పోల్చుతూ బుడ్డోడిని ఆకాశానికెత్తాడు. 'నేను తొలిసారి సచిన్ టెండూల్కర్‌ను చూసినప్పుడు అతను వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎలా ఎదుర్కొన్నాడో నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పుడే నాకు అర్థమైంది సచిన్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు అని. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు మళ్లీ అదే ఫీలింగ్ కలుగుతోంది. వైభవ్ కూడా చాలా ప్రత్యేకమైన ఆటగాడు. దేవుడే అతన్ని క్రికెట్ కోసం ప్రత్యేకంగా తయారు చేసి పంపినట్లున్నాడు. వైభవ్‌ను తన సహజ సిద్ధమైన శైలిలోనే ఆడనివ్వండి.. దేశానికి గొప్ప పేరు తెస్తాడు." అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.ఇటీవల ముగిసిన అండర్ 19 ప్రపంచ కప్‌లో వైభవ్ సూర్యవంశీ 7 మ్యాచ్‌ల్లో 439 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో 30 సిక్సర్లు బాది డెవాల్డ్ బ్రెవిస్ రికార్డును బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇప్పటివరకు 31 మ్యాచ్‌ల్లో 1280 పరుగులు చేసి 4 శతకాలు నమోదు చేశాడు.ఈ అద్భుత ప్రదర్శన నేపథ్యంలోనే వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు వైభవ్ సూర్యవంశీని శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత్-ఏ జట్టుకు ఎంపిక చేశారు.

# విరాట్ కోహ్లీపై నెటిజన్లు ఫైర్!



హైదరాబాద్ వేదికగా ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగిన మ్యాచ్ వన్‌సైడెడ్‌గా సాగినా గ్రౌండ్‌లో జరిగిన డ్రామా మాత్రం చర్చకు దారితీస్తోంది. కోహ్లీ బ్యాటింగ్ చేసినప్పుడు హెడ్ కవ్విస్తూ కామెంట్స్ చేశాడు. అప్పుడే విరాట్ సీరియస్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా హెడ్ షేక్ హ్యాండ్ ఇస్తే పట్టించుకోకుండా విరాట్ వెళ్లిపోయాడు. ఇప్పుడు దీన్నే నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఇది అహంకార పూరితమైన ప్రవర్తన అని కామెంట్స్ చేస్తున్నారు. ఉప్పల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెన్ అభిషేక్ శర్మ(56) ఇషాన్ కిషన్(79) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (51) తన స్టైల్‌లో ఇన్నింగ్స్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు హైదరాబాద్ బ్యాటటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ సమయంలో అసలు డ్రామా మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉన్నప్పుడు చాలా దూకుడుగా కనిపించాడు. వరుసగా ఫోర్లు బాదిన తర్వాత కోహ్లీ ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ ట్రావిన్స్ హెడ్‌ను ఉద్దేశించి వచ్చి బౌలింగ్ చేయ్ అన్నట్టు కామెంట్ చేశాడు. దీనికి సమాధానంగా హెడ్ కేవలం చిరునవ్వుతోనే బదులిచ్చాడు. అయితే ఈ మాటల యుద్ధం కోహ్లీకి కలిసి రాలేదు. కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టింది." వచ్చాడు, బౌలింగ్ చేశాడు, వికెట్ పడగొట్టి వెళ్లిపోయాడు" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రావిన్స్ హెడ్ బౌలింగ్‌కు వచ్చి ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీశాడు. కోహ్లీ హెడ్‌ను బౌలింగ్ చేయమని సవాల్ చేసినందున ఈ పోస్టు కోహ్లీని ఉద్దేశించిందేనని అభిమానులు భావిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ కోపం తగ్గలేదు. పెవిలియన్ నుంచి వస్తూ అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు కోహ్లీ. కానీ ట్రావిన్స్ హెడ్‌తో చేతులు కలపకుండా పక్కకు తప్పుకొని వెళ్లిపోయాడు. దీనికి హెడ్ కూడా షాక్ అయ్యి నవ్వి ముందుకెళ్లిపోయాడు. దీనిపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మైదానంలో జరిగిన విషయాలను ఇలా సీరియస్‌గా తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో రిటైర్ కాబోతున్నా కూడా మెచ్యూరిటీ రాలేదా అని ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరు కోహ్లీ అహంకారపూరితంగా వ్యవహరించారని అంటున్నారు. ఆ వ్యక్తి యాటిట్యూడే అలా ఉంటుందని, నచ్చితే మాట్లాడుతాడు లేకుంటే అసలు పట్టించుకోడని అంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో బెంగళూరు విఫలమైంది. దీంతో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆర్సీబీ తరఫున వెంకటేష్ అయ్యర్ 44 పరుగులు, రజత్ పాటిదార్ 56 పరుగులు, కృనాల్ పాండ్యా 41 పరుగులు చేశాడు. ఈ ఓటమి బెంగళూరుకు పెద్దగా నష్టం చేయలేదు. మెరుగైన రన్‌రేటు కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ టాప్2లో ఉంది. నేరుగా క్వాలిఫైయర్ 1కు అర్హత సాధించింది. క్వాలిఫైయర్ 1లో గుజరాత్‌టైటాన్స్‌తో తలపడనుంది.




# రజత్ పాటిదార్ అరుదైన ఘనత..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటిదార్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగంగా బంతుల పరంగా 100 సిక్సర్లు కొట్టిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాచ్‌లో హర్షల్ పటేల్ పటేల్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి ఈ ఘనతను సాధించాడు.ఐపీఎల్‌లో 100 సిక్సర్లు పూర్తి చేయడానికి పాటిదార్‌కు 933 బంతులు బంతులు అవసరం అయ్యాయి. ఇంతకముందు ఈ రికార్డు శివమ్ దూబె పేరిట ఉంది. అతడు 100 సిక్సర్లు కొట్టేందుకు 992 బంతులు తీసుకున్నాడు. ఇక ఓవరాల్‌గా ఐపీఎల్‌లో అత్యంత వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ఆటగాళ్ల జాబితాలో పాటిదార్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానంలో ఉండగా.. ఆ తరువాతి స్థానంలో నికోలస్ పూరన్ ఉన్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో 39 బంతులు ఎదుర్కొన్న రజత్ పాటిదార్..



# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు

## - నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

’సప్త సాగరాలు దాటి’ సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు.

బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్

## • త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు


సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా ‘కావ్య పాప‘ అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగు తున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల

## • అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ’లెనిన్’పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, ’లెనిన్’ టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు ’లెనిన్’ మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# 200 కోట్లు రాబట్టిన కరుప్ప

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం ’కరుప్పు’ తెలుగులో ’వీరభద్రుడు’ బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే ’కరుప్పు’ ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను ’కరుప్పు’ సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో ’వీరభద్రుడు’ పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.

# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

## - బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్ఆర్ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం ‘పెద్ది‘పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ ‘పెద్ది‘లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక ‘పెద్ది‘ తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ ‘పెద్ది‘ భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com